MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-



1



2



3

## కీలక సమావేశాలు... సంప్రతింపులు !

1. తెలంగాణా వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రఘునందన్ రావుతో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి బృందం
2. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డీన్ శ్రీ ఏ. ప్రతాపరెడ్డి తో శ్రీ సి ఎస్ రెడ్డి బృందం
3. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సి ఇ ఓ శ్రీ ఇంతియాజ్ తో శ్రీ సి ఎస్ రెడ్డి బృందం




'ఇర్మా'లో
శ్రీ సి ఎస్ ప్రసంగం



వ్యవసాయ విశ్వవిద్యాలయం లో
శ్రీ సి ఎస్ కు సన్మానం





నిజామాబాద్ జిల్లా మా పల్లె ఎఫ్ పి ఓ వార్షికోత్సవ సభలో, అనంతరం క్షేత్ర సందర్శనలో శ్రీ సి ఎస్ రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత శ్రీ దిల్ రాజ్, గ్రీన్ తత్వ అగ్రిటెక్ ఫౌండర్ శ్రీమతి రూప మాగంటి, డి ఎఫ్ ఓ శ్రీ శివకుమార్ ప్రభృతులు

## ముమ్మరంగా శిక్షణలు !








జనగావ్ ఫెడరేషన్‌కు ... వ్యాపారాభివృద్ధి పై సి ఆర్ పి-ఇ పి లకు , బి ఆర్ సి - ఓ బి లకు ... జాతీయ స్థాయి శిక్షకులకు శిక్షణ

నాబార్డ్ సౌజన్యంతో

NABARD


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 2



సంపాదకీయం

## మరో వైపు ...

చుట్టూ గిరిగీసుకున్నట్టు, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉన్నచోటనే ఉండిపోవాలనుకునే వారి సంగతి ఏమో కాని, ముమ్ముందుకు సాగాలనుకునే వారికి ... నిన్నటికి, నేటికి, రేపటికి ఎంతో కొంత ఎదుగుదల ఉండాలనుకునే వారికి ... ప్రతిరోజూ ఒకేలా వుండదు. సమస్యలు, సవాళ్ళు, ఆపదలు, అనర్థాలు ఎన్నో ఎదురవుతుంటాయి, ముందుకు సాగనీయకుండా అడ్డుపడుతుంటాయి. అయినా నిరుత్సాహపడకుండా, వెనుదిరగకుండా, ఆ అడ్డంకులను అధిగమించి ముందడుగు వేయగలిగితేనే లక్ష్యాన్ని సాధించడమైనా, విజయాన్ని చేజిక్కించుకోవడమైనా. ఒక్కొక్కసారి మూడడుగులు ముందుకు వేస్తే ఆరడుగులు వెనుకకు నెట్టే ప్రతికూల పరిస్థితులు ఎదురుకావచ్చు. ప్రస్తుతం మన దేశంలో వ్యవసాయ రంగం పరిస్థితి కూడా యిలానే వుంది. ఒకవైపు ఎంతో ఉత్సాహాన్ని , ఆనందాన్ని కలిగించే, సత్ఫలితాలను అందించే సానుకూల వాతావరణం. మరోవైపు పరిస్థితులు అనుకూలించినా చతికిలబడిన సాగు దుస్థితి. ఒకచోట రైతు సదవగాహనతో, సరైన రీతిలో, సంఘటితంగా ముందుకుసాగుతూ, చక్కగా వ్యవసాయంచేస్తూ, మార్కెట్ ధోరణులను అర్ధంచేసుకుంటూ, లాభాలు ఆర్జిస్తూ, తమ జీవితాలను మెరుగుపరచుకుంటున్నారనే ఆనందం. ఎఫ్ పి ఓలు నియమనిబంధనలను పాటిస్తూ, నిర్ణీత కార్యక్రమాలను, నిర్దిష్ట సమయంలో పూర్తిచేస్తున్నారనే సంతోషం. ఉదాహరణకు ఏపిమాస్ మార్గదర్శకత్వంలోని ఎఫ్ పి ఓలన్నీ సెప్టెంబర్ నెలలో వార్షిక మహాసభలను జరుపుకున్నాయి. అక్టోబర్ నెలలో సహకారశాఖ రిజిస్ట్రార్‌కు వార్షిక నివేదికలను అందజేయడానికి సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ అభినందించవలసిన విషయాలే. అయితే, యిక్కడి పరిస్థితి ఇలా వుంటే వెలుపల కొన్నిచోట్ల ఏర్పడుతున్న పరిణామాలు ఆందోళనకరంగా వున్నాయి. ఉదాహరణకు అన్నపూర్ణ అని పేరు పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే , వానలు సమృద్ధిగా కురిసినా కూడా దాదాపు పది లక్షల ఎకరాలలో వరినాట్లు పడలేదని వార్తలు వస్తున్నాయి. తెలంగాణా రాష్ట్రంలో గత సీజన్‌లో వరి ఇబ్బడి ముబ్బడిగా పండిందని సంబరపడుతుండగానే వచ్చే సీజన్ నుంచి వరి వేయవద్దని, వరి వేస్తే కొనలేమని ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు హెచ్చరికలు జారీచేసింది. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కొనలేమని కేంద్రప్రభుత్వం చెతులెత్తెయ్యడం! తమ వద్ద యిప్పటికే రాబోయే ఐదేళ్ళకు సరిపడా వరిధాన్యం నిల్వలు మూలుగుతున్నాయని , యిక ఏ మాత్రం కొనలేమని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ తెగేసి చెప్పిందట! వరి బాగా పండిందని, రైతు బాగా పండించాడని సంతోషపడాలో, మితిమీరి పండించారని బాధపడాలో అర్ధంకాని పరిస్థితి. అధికదిగుబడులు సాధించాలని ఊదరగొట్టే ప్రభుత్వాలు చెప్పినపని చేసిన రైతును చిక్కుల్లో పడవేయడమేమిటి? రైతులు ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించాలని చెప్పేవారే దిగుబడులు పెరిగితే ఏంచేయాలో ముందస్తు ప్రణాళికలు లేకుండా చేతులు దులుపుకోవడం ఏమిటి? పది లక్షల ఎకరాలలో పంటలు పడలేదంటే రైతులు ఎంతటి నిరుత్సాహానికి లోనైతే అలా వదిలేస్తారు? అది ఆ రైతు కుటుంబాలకు, సమాజానికి , దేశానికి ఎంతటి నష్టం! ఒకటి రెండు రాష్ట్రాల పరిస్థితే యిలా వుంటే మొత్తం దేశంలో పంటల పరిస్థితి అసలు ఏమాత్రమైనా ఆశాజనకంగా వుందా లేదా అనే సందేహం వస్తుంది కదా! నిజానికి చిన్న రైతులకు వ్యవసాయం బొత్తిగా గిట్టుబాటు కావడం లేదని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రెండున్నర ఎకరాలకు మించకుండా సాగుచేసే రైతులకు ఆదాయం ఒక కూలీకి వచ్చే ఆదాయంలో సగంకూడా వుండడంలేదని 2018-2019 వ సంవత్సరానికి నిర్వహించిన జాతీయ నమూనా సర్వే నిగ్గుతేల్చింది. రెండున్నర ఎకరాల లోపు సాగుచేసే చిన్నరైతు ఆదాయం రోజుకు కేవలం 224 రూపాయలేనట! నైపుణ్యంలేని కూలీ కూడా అంతకు రెట్టింపుకు పైగా పొందుతున్నారు. ఇలాంటి నిరుత్సాహ వాతావరణంలో రైతును ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ఎంతో వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించవలసి వుంది. ఇప్పుడు ఆహారధాన్యాలు పుష్కలంగా వున్నమాట నిజమేకావచ్చునేమోకాని, రైతుకు ప్రోత్సాహం కొరవడితే ఆహారధాన్యాలకు కరువు ఏర్పడడానికి ఎక్కువకాలం పట్టదు. ఆ ప్రమాదాన్ని గుర్తెరిగి ముందే జాగ్రత్తపడడం అవసరం. ప్రస్తుత వాస్తవిక పరిస్థితిని, భవిష్యత్ దృశ్యాన్ని సదవగాహన చేసుకుని ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించి రైతు నిలదొక్కుకునేలా, సమాజ ఆహార భద్రతకు లోపం ఏర్పడకుండా చూడాలి. ప్రభుత్వాల సంగతి అటుంచితే, వ్యవసాయపు ఆనుపానులు నేర్చుకుని ముందడుగు వేస్తున్న ఎఫ్ పి ఓలు కూడా తమ తోటి రైతులకు తమ అనుభవాలను వివరించి, వారు కూడా తమ సంస్థలలో భాగస్వాములై, సలహాసంప్రతింపులు, సహాయ సహకారాలు పొంది ఆదర్శ రైతులుగా ఎదగడానికి తోడ్పాటు అందించాలి. ఎదుటివారి బాగులోనే మన బాగుకూడా వుంటుందని మరువకూడదు.

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

**అడ్డంకులు ఆశా జీవిని మరింత శక్తి మంతుణ్ణి చేస్తాయి, నిరాశాజీవిని అవే నీరుగారుస్తాయి**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- లాభాలు సాధిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థలు! ...05
- 'నర్సింగ్‌పల్లి వ్యవసాయం దేశానికే ఆదర్శం' ...07
- మహిళా వ్యాపారులకు 'ఫిన్ సెరీన్' రుణాలు ...08
- భూమాత ఎఫ్‌పిఒ తృతీయ వార్షిక మహాసభ ! ...10
- పుంగనూరు ఆవుపాలు వెన్నలో మిన్న ! ...11
- రైతు ఆదాయం రోజు కూలీకంటె తక్కువ ! ...12
- కనిగిరిలో నీరు,పారిశుధ్యంపై శిక్షణలు ...14
- చిన్నకారు రైతుకు అండగా సీహెచ్‌సీలు ...16
- సాధించి సత్తాచాటిన ముగ్గురు మహిళలు ! ...18
- 'బ్లాక్‌చైన్'తో కావలసినన్ని విత్తనాలు, ఎరువులు! ...20
- జిఐజడ్ బృందంచే ఎఫ్‌పిఓల పనితీరు సమీక్ష ...21
- రైతులకోసం కెవికె అగ్రిటెక్ ఎటిపి మొబైల్ యాప్ ...22
- మహిళలకు వ్యాపార నిర్వహణలో శిక్షణ ...24
- తెలంగాణాలో వరి పంటకు ఎసరు ...25
- న్యాయవ్యవస్థలోనూ మహిళలకు సగభాగం! ...26
- వానాకాలం ఈ కూరగాయలకు ప్రతికూలం ! ...27
- ఈ మహిళా ఉద్యోగికి 1.8 కోట్ల పరిహారం ...30
- ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల వలస! ...31
- కూరగాయల సాగులో జీవన ఎరువులు ...32
- రైతు బిడ్డకు నాలుగు బంగారు పతకాలు ...34


**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆవహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు చైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

నీరు వుంటే ఏదైనా సజీవం , నీరే లేకుంటే సమస్త ప్రపంచం నిర్జీవం

# లాభాలు సాధిస్తున్న రైతు ఉత్పత్తి దారుల సంస్థలు!

– ఎస్.ప్రహల్లాద

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఏపిమాస్ చిన్న, సన్నకారు రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓలను) ఏర్పాటు చేసి రైతులు తమ, తమ సంస్థల అభివృద్ధికోసం తమంత తాము వివిధ కార్యక్రమాలను చేపట్టే విధంగా ఎఫ్ పి ఓలను బలోపేతం చేస్తున్నది. ఒకవైపు రైతులకు పంట వ్యయాలను తగ్గించే వివిధ రకాల కార్యక్రమాలపై అవగాహన కలిగిస్తూ, మరోవైపు ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కూడా వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చేస్తున్నది. ప్రస్తుతానికి చిత్తూరు జిల్లాలో 14 మండల స్థాయి ఎఫ్ పి ఓలను, ఒక జిల్లా స్థాయి సమాఖ్యను ఏర్పాటు చేసింది. వీటిలో 8 మండల స్థాయి సంస్థలను, జిల్లా స్థాయి సమాఖ్యను జిఐసి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయగా, మిగిలినవి ఉద్యానశాఖ, అరబిందో ఫార్మా పథకాలలో భాగంగా ఏర్పాటు చేసింది. ఈ సంస్థలలో ఐదు రైతు ఉత్పత్తిదారుల కంపెనీల చట్టం క్రింద నమోదు కాగా, మిగిలినవి సహకార సంఘాల చట్టం క్రింద నమోదయ్యాయి.



ప్రతి రైతు ఉత్పత్తి దారుల సంస్థ కూడా ప్రతి సంవత్సరం తాము నిర్వహించవలసిన చట్టబద్ధ కార్యక్రమాలలో భాగంగా వార్షిక మహా సభను జరుపుకోవలసి వుంటుంది. అందుకు అనుగుణంగా, సెప్టెంబరు నెలలో అన్ని రైతు సంస్థలు కూడా వార్షిక మహాసభలను నిర్వహించాయి. వార్షిక నివేదికల ఆధారంగా సంస్థల లాభ నష్టాలను విశ్లేషించినప్పుడు ప్రతి రైతు సంస్థ కూడా లాభాలలో పయనిస్తున్నదని స్పష్టంగా తెలుస్తున్నది. జిఐసి పథకంలో భాగంగా ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆర్జించిన లాభాలను వాటి ఆడిట్ నివేదికల ఆధారంగా ఈ క్రింది పట్టిక తెలియజేస్తుంది.

**ఎఫ్‌పిఓల వారీగా లాభాలు**

| ఎఫ్‌పిఓ పేరు | లాభము (రూ.లు) |
|---|---|
| మదనపల్లి | 2,63,743 |
| పీలేరు | 2,75,216 |
| పలమనేరు | 3,15,049 |
| కురబలకోట | 3,73,218 |
| వాల్మీకి పురం | 3,88,441 |
| కలికిరి | 4,57,168 |
| వి కోట | 4,60,925 |
| నిమ్మనపల్లి | 5,24,610 |
| రామసముద్రం | 5,43,716 |
| ఎం–టమాటో | 6,27,530 |

పొందిన లాభాలను, అవి వచ్చిన మార్గాలను విశ్లేషించినపుడు తక్కువ పెట్టుబడితో కూరగాయల మార్కెటింగ్ ద్వారా ఎక్కువ లాభాలు సాధించినట్లు స్పష్టం అవుతున్నది.

**భవిష్యత్ ప్రణాళికలు:**

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా తమ భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకొని మహాసభల ఆమోదం పొందినవి. అందులో ప్రధానంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు, పశువుల దాణా కూరగాయల మార్కెటింగ్ మొదలైనవి ప్రధాన అంశాలుగా వున్నాయి.



ప్రభుత్వ అధికారులతో సమన్వయం: ప్రతి ఎఫ్‌పిఓ వార్షిక మహాసభలో ప్రభుత్వ అధికారులు పాల్గొని, ఎఫ్‌పిఓల ప్రగతిని కనులారా తిలకించి తమ శాఖల ద్వారా రైతుల అభివృద్ధికి చేపట్టిన వివిధరకాల కార్యక్రమాలను వివరించడం జరిగింది. ముఖ్యంగా ఉద్యానశాఖ ఉపసంచాలకులు, సహాయ సంచాలకులు, అధికారులు, వ్యవసాయ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు మొదలగువారు పాల్గొని సభలను విజయవంతం చేశారు.

**ఎన్నికలు :** ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తమ బైలాప్రకారం ప్రతి సంవత్సం ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నది. అనంతరం కార్యవర్గ సభ్యులు పదాధికారులను ఎంపిక చేస్తున్నారు.

**ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం :** రైతు ఉత్పత్తిదారుల సంస్థలు దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతున్న ప్రస్తుత తరుణంలో వివిధ ప్రైవేటు ఎరువుల, క్రిమిసంహారక మందుల తయారీ కంపెనీలు, పశువుల దాణా తయారీ కంపెనీలు సంస్థల వార్షిక మహాసభల సమావేశాలకు వచ్చి వారి వారి ఉత్పత్తులను ప్రదర్శించడం జరిగింది. అంతేగాక రైతులలో చైతన్యం కలిగించుటకు వివిధ రకాల సమావేశాలు, శిక్షణలు ఏర్పాటు చేయుటకు వారు ముందుకు వచ్చారు. మదనపల్లిలోని 'సత్సంగ్ ఫౌండేషన్' వారు గ్రామీణ ప్రాతాలలోని రైతు కుటుంబాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలకు శిక్షణలు ఇప్పించి వారికి శాశ్వత ఉపాధిని అందించే కార్యక్రమాలను చేపడుతున్నట్టు సమావేశాలలో పాల్గొన్న అందరికి తెలియజేశారు.

**నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన :** రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగించి, ఆచరించేలా చూడడానికి ఎస్4ఎస్ టెక్నాలజీ వారు సౌరశక్తితో పనిచేసే స్ప్రేయర్లను, హైడ్రోఫోనిక్ సాంకేతికను ప్రదర్శించారు.

**సన్మానాలు :** రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వ అధికారులను వార్షిక సమావేశాలలో ఎఫ్‌పిఓలు ఘనంగా సత్కరించాయి. కొత్త కార్యవర్గాలు ఏర్పడడంతో బైలా ప్రకారం పదవినుండి వైదొలగిన కార్యవర్గ సభ్యులను కూడా వారి సేవలు కొనియాడుతూ ఎఫ్‌పిఓలు ఘనంగా సత్కరించి వారి అనుభవాలను, సేవలను సంస్థ అభివృద్ధికి కొనసాగించవలసినదిగా కోరడం జరిగింది.

**ప్రత్యక్ష, పరోక్ష సమావేశాలు :**

కరోనా ముప్పు నుండి ప్రజలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారు. అందువల్ల ప్రత్యక్ష సమావేశాలకు హాజరు కావడానికి కొంతమంది ఇంకా సంకోచిస్తున్నారు. అంతేగాక దూరప్రాంతాలలో వుండే అధికారులు ఇతర పనులలో తీరిక లేకుండా ఉంటున్నారు. సమావేశాలకు హాజరు కావాలని కోరిక వున్నప్పటికీ వివిధ కారణాల వలన మరికొంతమంది హాజరు కాలేక పోవుచున్నారు. అందువలన ప్రత్యక్షంగా హాజరు కాలేని అధికారులకు, సభ్యులకు జూమ్ ద్వారా సమావేశాలను తిలకించే ఏర్పాటు చేయడం జరిగింది.

**రిటర్న్‌ల సమర్పణ :** చట్ట బద్ధ కార్యక్రమాలలో చివరి ఘట్టం రిటర్నుల సమర్పణ. అందువలన రైతు ఉత్పత్తిదారుల సంస్థలు తగు నివేదికలు తయారుచేసి జిల్లా సహకారశాఖ అధికారులకు అక్టోబరు నెలలో సమర్పించాలని ప్రణాళికలు తయారు చేసుకొన్నారు. ■

# 'నర్సింగ్‌పల్లి ప్రకృతి వ్యవసాయం దేశానికే ఆదర్శం'

**మో**పాల్ మండలం నర్సింగ్‌పల్లిలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయం దేశానికే ఆదర్శమని ఏపిమాస్ (ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ) సీఈవో శ్రీ సీఎస్ రెడ్డి అన్నారు. నర్సింగ్‌పల్లిలో సెప్టెంబర్ 28న నిర్వహించిన 'మా పల్లె ఆర్గానిక్ ఫార్మింగ్ ఫార్మర్స్ సర్వీస్ మ్యాచువల్లి




ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' (ఎఫ్ పి ఓ) వార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా శ్రీ సీఎస్ రెడ్డి హాజరైనారు. ప్రకృతి వ్యవసాయం చేయడమే కాకుండా దానికి ఆధ్యాత్మికత జోడించడంతో లోకకళ్యాణానికి నర్సింగ్‌పల్లిలోనే బీజం పడిందని, వ్యవసాయం అంటే పంట సాగు ఒక్కటే కాదని, రైతులు అన్నివిధాలుగా అభివృద్ధి చెందడమని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని ఆయన అన్నారు.

మరో అతిథి గ్రీన్‌తత్వ అగ్రిటెక్ ఫౌండర్ రూప మాగంటి మాట్లాడుతూ దేశాన్ని సంస్కరించాలంటే రైతును పటిష్టపరిస్తే చాలన్నారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసేవారు ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరంలేదని, పంటలను రెట్టింపు ధరలు ఇచ్చి కొనడానికి వినియోగ దారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం అంటే స్వయం అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి అని ఆయన పేర్కొన్నారు.

సొసైటీ సభ్యుడు దిల్ రాజు మాట్లాడుతూ చిన్ననాటి రోజులు గుర్తు కొస్తున్నాయని, దేశానికి ఉపయోగపడే కార్యం తమ ఊరి నుంచి మొదలవ్వడం గర్వంగా ఉందన్నారు.

అనంతరం ఉత్తమ రైతు అవార్డును శ్రీ దినకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయరామ్, గ్రీన్‌తత్వ అగ్రిటెక్ ఫౌండర్ రూప మాగంటి, డీఎఫ్ఓ శివకుమార్, మాపల్లె ఆర్గానిక్ ఫార్మింగ్ ఫార్మర్స్ సర్వీస్ మ్యాచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యుడు, ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, రాజేశ్వర్, నాగేశ్వరరావు, నరాల సుధాకర్, మురళి, రవీందర్‌రావు, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ■



# మహిళా వ్యాపారులకు సులువుగా 'ఫిన్ సెరీన్' రుణాలు !

– డాక్టర్ ఎమ్.నాగిరెడ్డి

పది లక్షలమంది మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా చూడాలన్న లక్ష్యంతో 'ఇండస్ ఇండ్ బ్యాంక్' సహకారంతో 'బిజినెస్ కరస్పాండెన్స్' (బిసి) మోడెల్లో వ్యాపారం నిర్వహించే 'ఫిన్ సెరీన్' సంస్థ ను 2019 జనవరి 25 తేదీన హైదరాబాద్‌లోని నాగోలులో మొదటి బ్రాంచ్ ప్రారంభించారు. ఈ ఫిన్ సెరీన్ ముఖ్య ఉద్దేశ్యం మహిళా వ్యాపారులకు ఆర్థిక సహకారం అందిస్తూ వారి వ్యాపారాలను బలోపేతం చేస్తుంది. ఫలితంగా జీవనోపాధులు సుస్థిరమవుతాయి, స్థానికంగా ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. నేటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పది బ్రాంచ్‌లు ఏర్పాటై, మహిళా వ్యాపారులకు ఋణాలను అందజేస్తున్నాయి. ఈ బ్యాంక్ శాఖల విస్తరణలో భాగంగానే తిరుపతి పట్టణంలో 2020 సెప్టెంబర్ 19వ తేదీన బ్రాంచ్ ఏర్పాటు చేసి 10 మంది సిబ్బందితో బ్యాంక్ సేవలు ప్రారంభించి, కేవలం సంవత్సర కాలంలోనే 770 మంది మహిళా వ్యాపారులను గుర్తించి, వారి వ్యాపారాల అభివృద్ధికోసం వారికి 7.72 కోట్ల రూపాయల మేర రుణాలు అందించారు. అప్పు తీసుకున్న మహిళలు కూడా నూటికి నూరు శాతం తిరిగి చెల్లింపులు చేస్తున్నారు.

**ఈ లోన్ వలన ప్రయోజనాలు**

- నెల వాయిదాల చెల్లింపు మినహా ఏ ఇతర ఛార్జీలు వుండవు
- మహిళల నుంచి వారి ఇంటి వద్దే దరఖాస్తు పత్రం తీసుకుంటారు. నెల నెలా వాయిదాల మొత్తాన్ని అప్పు తీసుకున్న వారి ఇంటి వద్దకే ఫీల్డ్ అసిస్టెంట్ వచ్చి తీసుకుంటారు. దీని వలన సమయం, బ్యాంకికి వెళ్ళిరావడానికి అయ్యే ఖర్చు అదా అవుతుంది.
- లక్ష రూపాయలతో ప్రారంభించి రానురాను పది లక్షల రూపాయల వరకు అప్పు తీసుకోవచ్చు.
- తీసుకున్న అప్పు వాయిదాల సక్రమ చెల్లింపు వలన లోన్ తీసుకొన్న వారి 'సిబిల్ స్కోర్' (రుణం పొందే అర్హత) పెరుగుతుంది. దీని వలన ఫిన్ సెరిన్, ఇండస్ ఇండ్ లోనే కాక ఇతర బ్యాంక్‌లలో కూడా లోన్ పొందడం సులువవుతుంది.
- అధిక వడ్డీల నుండి (కుదువ వ్యాపారులు, అధిక వడ్డీ చిట్టీలు, రోజువారీ, వారాంతపు వడ్డీ, అసలు చెల్లింపులు నుండి బయట పడవచ్చు).
- ఎటువంటి ఆస్తి పత్రాలు, బంగారు లేదా వాహనాలు తాకట్టు పెట్టకుండానే రుణం లభిస్తుంది.
- ఎటువంటి పొదుపులు, డిపాజిట్‌లు తీసుకోవడం లేదు.
- లోన్ తీసుకొన్నరోజే పారదర్శకంగా రీపేమెంట్ షెడ్యూల్ యిస్తారు.
- ఈ లోన్ మహిళల పేరు మీద ఇస్తున్నారు కనుక మహిళలకు కుటుంబంలో విలువ పెరుగుతుంది.
- ఒంటరిమహిళలు, వితంతువులు, ఏ ఆసరా లేని మహిళా వ్యాపారులకు లోన్ సులభంగా దొరుకుతుంది ఆత్మ గౌరవంతో వారు వారి వ్యాపారాలను సాగించుకోగలుగుతారు.
- బ్యాంక్ లావాదేవీలు, ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన పెరుగుతుంది.

'ఫిన్ సెరీన్' లోన్ తీసుకొన్న సభ్యులే ఆ లోన్ ఎంత సులువుగా, ఎంత ఉపయోగకరంగా వున్నదో ఇతరులకు తెలియచేస్తూ ఫిన్ సెరీన్ కార్యక్రమాలు మరింత విస్తృతం కావడానికి, అప్పుకోసం కొత్తవారు రావటానికి దోహద పడుతున్నారు. ఈ లోన్ తీసుకున్నవారు లోన్ పొందడంలో తమ అనుభవాలను, ఆ రుణంతో తమ వ్యాపారాలు, జీవితాలు మెరుగుపడిన తీరు గురించి తెలిపిన విశేషాలను వారి మాటలలోనే తెలుసుకుందాం.

**మాట పొదుపు నీకు మేలు, ధనం పొదుపు నీ కుటుంబానికి మేలు, జలం పొదుపు జగతికి మేలు**

**లక్ష అప్పుతో కుటుంబానికి కొత్త వెలుగు !**

శ్రీమతి ఈశ్వరి, ఆమె భర్త (రామనాథ్) ఇద్దరు కలిసి 12 సంవత్సరాలపాటు తిరుపతిలోని జీవకోనలో బట్టల వ్యాపారం చేశారు. ఏడు సంవత్సరాల క్రితం ఈశ్వరి భర్త రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆమె ఒంటరి అయ్యింది. జీవితంలో కష్టాలు మొదలయ్యాయి. వ్యాపారాన్ని పెంపొందించుకోవడం కోసం పెట్టుబడి పెట్టాలంటే ఇబ్బందిగా మారింది. ఉన్నంతలోనే వ్యాపారాన్ని సాగిద్దామంటే ఆదాయం లేక అలమటించాల్సి వచ్చింది. వడ్డీ వ్యాపారుల వద్ద నూటికి ఎనిమిది రూపాయల వడ్డీకి





రూ. 50,000/- అప్పుచేసి, ఆ పెట్టుబడితో వ్యాపారాన్ని సాగిస్తుంటే వచ్చిన ఆదాయంలో ఎక్కువ భాగం వడ్డీ చెల్లించడానికే సరిపోతున్నది. ఈ దుస్థితికి కరోనా కూడా తోడవడంతో వడ్డీకి కూడా అప్పు పుట్టడం లేదు.

ఈ పరిస్థితిలో ఫిన్ సెరిన్ - ఇండస్ ఇండ్ వారి ఫీల్డ్ అసిస్టెంట్ మాధవి ఫిన్ సెరిన్ లోన్ గురించి చెప్పి వివరాలన్నీ తీసుకొని వారం లోపే తక్కువ వడ్డీకి లక్ష రూపాయల లోన్ ఇప్పించి ఈశ్వరి తన దుకాణానికి ఎక్కువ మొత్తం సరుకు తీసుకురావడానికి దోహదపడ్డారు. “ఒంటరి మహిళను అయిన నాకు అప్పు ఇవ్వడానికి మా బంధువులు సైతం ముందుకురాని సమయంలో ‘ఫిన్ సెరిన్ ’ యిచ్చిన అప్పు నా కుటుంబం అధికవడ్డీల ఊబినుండి బయట పడడానికి ఎంతగానో ఉపయోగపడింది. ఇంతకుముందు నెలవారీ చెల్లించే అధిక వడ్డీని ఇపుడు పొదుపు చేస్తున్నాను. ఈ పొదుపు చేసిన డబ్బుతో నా కుమారుణ్ణి మంచి స్కూల్‌లో చదివిస్తా. ప్రస్తుతం నా వ్యాపారం బాగా జరుగుతున్నది. నా దుకాణంలో అన్నిరకాల మోడల్ పంజాబీ డ్రస్సులు వున్నాయి. నేను ఇపుడు చాలా ధైర్యంగా వున్నాను”.

**అధిక వడ్డీ బాధ తప్పింది, వ్యాపారం పెరిగింది**

శ్రీమతి గాయత్రి , ఆమె భర్త మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో కిరాణా, ఫ్యాన్సీ షాప్ నడుపుతూ, అందులో వచ్చే ఆదాయాన్ని పంచుకునే వారు. కానీ ఆ ఆదాయం గాయత్రి కుటుంబ అవసరాలకు సరిపడేది కాదు. అందువల్ల గాయత్రి సంఘంలో 30,000 రూపాయలు అప్పు తీసుకొని వ్యాపారాన్ని వారే సొంతంగా సాగించడం ప్రారంభించారు. కానీ ఆ డబ్బుతో గిరాకీకి సరిపడా సరుకు వచ్చేది కాదు. దీంతో అధిక వడ్డీలకు అప్పుతెచ్చి వ్యాపారంలో పెట్టుబడి పెట్టేవారు. కానీ వచ్చే ఆదాయంలో అధిక భాగం వడ్డీలు చెల్లించడానికే సరిపోయేది. దీంతో పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైంది. ఈ దశలో ఫిన్ సెరిన్ ఫీల్డ్ అసిస్టెంట్ అనసూయ ఫిన్ సెరిన్ అప్పు గురించి వివరించి, వారినుంచి అవసరమైన వివరాలు తీసుకొని వారం లోపే 1.50 లక్ష రూపాయలు అప్పు వచ్చే విధంగా చేశారు. ఆ అప్పుతో ఎక్కువ మొత్తంలో సరుకు తెచ్చుకొన్నాము. మా షాప్ అలిపిరికి దగ్గరగా వున్నది కావున వ్యాపారం బాగా జరుగుతున్నది. అధిక వడ్డీలనుండి బయట పడ్డాం. ఫిన్ సెరిన్ యిచ్చే అప్పుపై వడ్డీ తక్కువ. తిరుపతిలో ఈ బ్యాంక్ పెట్టినందుకు చాలా సంతోషంగా వుంది.

ఈ కార్యక్రమాలన్నీ ప్రతి రోజు హైదరాబాద్ నుండి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై వి రఘునాథ్ రెడ్డి, ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీమతి బి వసుమతి నిరంతరం పర్యవేక్షిస్తూ, అన్ని బ్రాంచ్‌లకు తగు సలహాలు, సూచనలు ఇస్తూ క్రమశిక్షణతో ఫిన్ సెరిన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ■

# భూమాత ఎఫ్ పి ఓ తృతీయ వార్షిక మహాసభ !

**అ**నంతపురం జిల్లా ధర్మవరం మండలం రావుల చెరువు గ్రామంలో నందు 'భూమాత మహిళా రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం' (ఎఫ్ పి ఓ) ఆధ్వర్యంలో మూడవ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు 152మంది మహిళా రైతులు (వాటాదారులు)హాజరయ్యారు. మండల వ్యవసాయ అధికారి శ్రీ చిన్న వీరస్వామి, ఏ డి ఏ శ్రీ కృష్ణయ్య హాజరయ్యారు. అనంతపురానికి చెందిన ఏ ఎఫ్ ఎకాలజీ సంస్థ నుండి కో ఆర్డినేటర్‌లు రుద్రయ్య గారు, రిజ్వాన గారు, భాస్కర్ చంద్ర గారు, రవికుమార్ గారు, అకౌంటెంట్ పద్మజ గారు, మండల టీం లీడర్ రమేష్ గారు, ఎస్ టి ఓ లక్ష్మీదేవి, సి ఇ ఓ రాఘవేంద్ర , ప్రతాప్ కుమార్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీ చిన్న వీరస్వామి, శ్రీ కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్యక్రమాల అమలులో ఎఫ్ పి ఓ. సచివాలయం వి ఏ ఏ గారితో కలిసి ప్రభుత్వ పథకాలకు ఇ-క్రాప్ నమోదు చేయించుకొని ఇన్పుట్ సబ్సిడీ, పంట బీమా మొదలైన ప్రయోజనాలు పొందాలని సభ్యులను కోరారు. కో ఆర్డినేటర్ లు రుద్రయ్య, రైజ్వాన, భాస్కర్ చంద్ర, రవికుమార్ మాట్లాడుతూ భూమాత ఎఫ్ పి ఓ అభివృద్ధి చెందాలంటే పాలకవర్గ సభ్యులు సమర్థవంతంగా పనిచేసి వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుస్తున్నారని, ఎఫ్ పి ఓ ద్వారా వ్యవసాయరంగంలో ఆర్థిక పురోగతి సాధించాలని పేర్కొన్నారు. అదేవిధంగా 2020-21 ఆర్థిక నివేదిక, ఆస్తి, అప్పుల పట్టీ, ఆడిట్ నివేదికలను, నూతన పాలక వర్గాన్ని సభ కు హాజరైన వాటాదారులు ఆమోదిస్తూ తీర్మానించారు. భూమాత ఎఫ్ పి ఓ పరిధిలోని గ్రామాల రైతులతో వేరుశనగలు, ఉలవలు, జొన్నలు, వ్యవసాయ పనిముట్ల వ్యాపారం చేసి భూమాత ఎఫ్ పి ఓ ను అభివృద్ధి పథంలో నడిపించాలని సమావేశం తీర్మానించింది. ఎఫ్ పి ఓ సభ్యత్వం 500 పైగా పెంచాలని సమావేశం తీర్మానించింది.

### ధీశాలి ఎఫ్ పి ఓ నాల్గవ వార్షికోత్సవం

**వ్య**వసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో మహిళా రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలని ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడిలో ఇటీవల గ్రామీణ మహిళామండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యం లో ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చతుర్థ వార్షికోత్సవ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్థ మహిళా రైతులకు సేంద్రియ వ్యవసాయం, మొబైల్ మార్కెటింగ్,బ్యాంక్ రుణాలు వంటి అంశాల్లో ఇచ్చిన శిక్షణతో ఆర్థికంగా బలోపేతం కావడం అభినందనీయమన్నారు. నాబార్డ్ సీడీఎం సత్యనారాయణ, ఏపీమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ కిశోర్‌కుమార్, ఏడీఏ పద్మావతి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కృష్ణ, సర్పంచ్ చిమ్ముల రవీందర్‌రెడ్డి, పీస్ సంస్థ డైరక్టర్ నిమ్మయ్య, ఎంపీటీసీ పాద్యానాయక్, పీఏసీఎస్ డైరక్టర్ బేద్యానాయక్, ధీశాలి ఛైర్‌పర్సన్ మంజుల, సీఈఓ హరిలాల్ పాల్గొన్నారు.

### మార్కెటింగ్ నైపుణ్యాలు నేర్చుకుంటేనే లాభాలు

**రై**తులు పంటలను పండించడంతో పాటు వాటిని మార్కెటింగ్ చేసుకోగల నేర్పరితనాన్ని సంపాదించినప్పుడే లాభాల బాటలో నడుస్తారని నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. వివేకా మినీ ఫంక్షన్ హాలులో ఇటీవల జరిగిన ఆజీవ మహిళా రైతుఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్‌పిసి) 4వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పశు సంవర్ధకశాఖ శాఖాధికారి డాక్టర్ కృష్ణయ్య, రైబస జిల్లా సమన్వయకర్త కొలుపుల అమరేందర్, యాదగిరిగుట్ట ఎంపీపీ చీర్ల శ్రీశైలం, జడ్పీటీసీ సభ్యురాలు అనూరాధ, జిల్లా సహాయ వ్యవసాయాధికారిణి నీలిమ, పీస్ సంస్థ డైరక్టర్లు నిమ్మయ్య, అరుణ, ఆజీవ మహిళా ఎఫ్‌పిసి సమన్వయకర్తలు, ఏపిమాస్ కు చెందిన దివ్యశ్రీ, కిశోర్‌కుమార్, ధీశాలి ఎఫ్‌పీఓ సలహాదారు విజయలక్ష్మి పాల్గొన్నారు. ■

# పుంగనూరు ఆవుపాలు వెన్నలో మిన్న !

-డాక్టర్ ఎం. భార్గవి

ప్రపంచంలోనే అతి పొట్టి లేదా మరుగుజ్జు జాతికి చెందినవే పుంగనూరు ఆవులు. వీటిని ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని పుంగనూరు రైతులు అభివృద్ధి చేయడంతో వాటికి పుంగనూరు జాతి అని పేరు వచ్చింది. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, వాయల్పాడు, మదనపల్లి పొట్టి జాతి ఆవులకి ప్రసిద్ధి. ఒంగోలు జాతి ఆవుల మాదిరి పుంగనూరు కూడా దేశం గర్వించదగ్గ గోజాతి. కానీ ఇప్పుడు ఈ జాతి ఆవులు అంతరించిపోయే దశలో వున్నాయి. ప్రపంచంలోనే అధిక వెన్నశాతంగల పాలు ఇచ్చే ఆవు ఇదే.




పుంగనూరు ఆవును అత్యంత పవిత్రంగా భావిస్తారు. మోపురం వున్న దేశి ఆవులేవైనా విశ్వశక్తిని (కాస్మిక్ ఎనర్జీని) గ్రహించి చుట్టూ వున్న వాతావరణంలోకి విడుదల చేస్తాయని నమ్ముతారు. దీనివల్ల పుంగనూరు ఆవు వున్న పరిసరాల్లో దైవిక వాతావరణం నెలకొంటుందని భావిస్తారు. అందుకే వీటితో బయట మార్కెట్‌లో భారీ వ్యాపారమే జరుగుతోంది. ఒక్కో ఆవు ధర లక్షల్లో ఉంటుంది. ఇవి రోజుకు 2 నుంచి 3 లీటర్లు పాలిస్తాయి. సాధారణ ఆవు పాలలో ఔషధ విలువలతో పాటు 3 నుంచి 3.5 వరకు వెన్నశాతం ఉంటుంది.

వీటి ప్రత్యేక లక్షణం ఏమిటంటే పుంగనూరు ఆవు పాలలో వెన్న 8 శాతం ఉంటుంది. ఎస్ఎన్ఎఫ్ – సాలిడ్స్ (నాట్ ఫ్యాట్) 9 శాతం ఉంటుంది. దీనివల్ల పాలకు అధిక ధర లభిస్తుంది. తిరుమల–తిరుపతి దేవస్థానాల గోశాలలో పుంగనూరు ఆవులను పెంచుతున్నారు. ఈ ఆవు పాలనుంచి వచ్చే నెయ్యిని శ్రీవారి అభిషేకానికి వాడుతుంటారు.

**పేదల ఆవు**

పొట్టిగా 70–90 సెంటీమీటర్లు ఎత్తు అంటే సుమారు 2–3 అడుగుల ఎత్తు మాత్రమే వుంటాయి. 115–200 కిలోల బరువుతో మామూలు ఆవుదూడ సైజులో ఉంటాయి. చూడటానికి చాలా ముచ్చటగా బొమ్మలమాదిరిగా అందంగా ఉంటాయి. లేత బూడిద, తెలుపు రంగులో విశాలమైన నుదురు, చిన్న కొమ్ములుంటాయి. వీటి తోక నేలను తాకుతుంది. ఆవు సగటున 3 నుంచి 5లీటర్ల పాల దిగుబడిని ఇస్తుంది. రోజుకి 5 కిలోల మేత తీసుకుంటుంది. కరువు పరిస్థితులను సమర్థంగా తట్టుకోవడం వల్ల గతంలో పేదవాడి ఆవులుగా పేరు పొందాయి. అచ్చం ఎండు గడ్డి తిని కూడా మనుగడను సాగించగలవు.



తిరుమల, తిరుపతి దేవస్థానపు గోశాలలో పుగనూరు ఆవులు

శరీరం పొట్టిగా కుదించినట్లుగా ఉంటుంది. శరీర రంగు తెలుపు, బూడిద లేదా లేత గోధుమ నుంచి ముదురు గోధుమ లేదా ఎరుపుగా ఉంటాయి. కొన్నిసార్లు ఎరుపు గోధుమ లేదా నలుపు మచ్చలతో కలిపిన తెలుపు రంగు కలిగినవి కూడా కనిపిస్తాయి. చర్మం బిగుతుగా ఉంటుంది. కనురెప్పలు, మూతి నలుపుగా ఉంటాయి. గంగడోలు వేలాడుతూ వుంటుంది. నుదురు లోతుగా విశాలంగా, ప్రస్ఫుటంగా ఉంటుంది. మూపురం ఆడ వాటిలో చిన్నదిగా, మధ్యస్థంగా, మగవాటిలో పెద్దదిగా ఉంటుంది. ఛాతీ బాగా పెరిగిన పక్కటి ఎముకలతో పొడవుగా ఉంటుంది. కొమ్ములు పొట్టిగా నెలవంక ఆకారంలో, వెనక్కి లేదా పక్కలకు వంపు తిరిగి కూడా ఉంటాయి. కాళ్ళు నలుపు మచ్చలతో పొట్టిగా

**(మిగతా 13వ పేజీలో)**

# రైతు ఆదాయం రోజు కూలీకంటె తక్కువ !

**రెండున్నర ఎకరాల పొలం వున్న రైతు రోజు సంపాదన రూ.224 ... జాతీయ నమూనా సర్వేలో వెల్లడి**

**ఆ**రుగాలం శ్రమ... బండెడు చాకిరీ... ఆదాయం చూస్తే అరకొర. భూమినే నమ్ముకుని ఏటికేడూ పట్టు వదలక సాగు చేస్తే వారికి దక్కేదెంతో తెలుసా? రోజు కూలి కంటే తక్కువ. కనీస ధర లభించకపోయినా.. గత్యంతరం లేక... భవిష్యత్తుపై ఆశతో మళ్ళీ మళ్ళీ పంటలు వేసే రైతులు చివరకు గిట్టుబాటు కాక అప్పుల పాలవుతున్నారు. కొండంత కష్టపడినా వారికి దక్కేది గోరంతే. హెక్టారు (2.50 ఎకరాలు) మించకుండా భూమి ఉన్న రైతు కుటుంబానికి రోజుకు సగటున రూ.224 మాత్రమే ఆదాయం వస్తోంది.

రోజు కూలీ చేసే వారికి గ్రామాల్లో రూ.300- 500, నగరాల్లో రూ.600-700 వస్తోంది. ప్రభుత్వంలో చిన్నస్థాయి ఏ ఉద్యోగికైనా నెలకు కనీసం రూ.20 వేలు వస్తుంది. కానీ పంటలు పండించిన రైతు సగటు ఆదాయం చూస్తే విస్మయం చెందాల్సిందే. 2018 జులై నుంచి 2019 జూన్ వరకూ (సంవత్సర కాలానికి) ఎకరం నుంచి 2.50 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతు కుటుంబానికి నెలవారీ సగటు ఆదాయం రూ.6,951 చొప్పున వచ్చింది. రైతాంగంలో సగం మంది అప్పుల్లోనే ఉంటున్నారు. ఈ విషయాలన్నీ కేంద్ర ప్రభుత్వం జులై 2018 నుంచి జూన్ 2019 మధ్య కాలంలో చేపట్టిన జాతీయ నమూనా సర్వేలో వెల్లడయ్యాయి.

- ప్రతి 100 మంది రైతుల్లో 50.2 శాతం మంది అప్పుల్లో ఉన్నారు.
- ప్రతి రైతు కుటుంబానికి సగటున రూ.74,121 రుణం ఉంది.

**ఆదాయం లేక.. కూలీకీ కొరగాక!**

మన రైతుల ఆదాయం నానాటికి దిగజారిపోతోంది. దేశంలో మొత్తం 10.18 కోట్ల భూమి కమతాలుంటే అందులో 2.50 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులే 72.6 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో అయితే 2.50 ఎకరాల్లోపు ఉన్నవారు 53 శాతం, తెలంగాణలో 42.2 శాతం మంది ఉన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ భూములు, రైతు కుటుంబాలు, పంటల మద్దతు ధరలు తదితర అంశాలపై జాతీయ నమూనా సర్వే చేసింది. ఈ వివరాలను కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసింది.

**ఏ అవసరం వచ్చినా అప్పు చేయాల్సిందే..**

- రైతు కుటుంబాలు ఏ పెద్ద అవసరం వచ్చినా అప్పు చేయాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. అయిదెకరాల లోపు భూమి ఉన్న రైతుల నెల సగటు ఆదాయం రూ.9,189. దేశంలో 88.5 శాతం, ఏపీలో 77.3, తెలంగాణలో 75.5 శాతం రైతు కుటుంబాలు నెలకు వచ్చే ఈ కాస్త ఆదాయంతోనే (రూ.9,189తోనే) నెట్టుకురావాలి.
- పంటల సాగుకు నెలకు సగటున రూ.6960 చొప్పున రైతు కుటుంబం ఖర్చు పెడుతోంది.
- పాడి పశువుల పెంపకం, వ్యవసాయేతర పనులు, కూలికెళ్ళడం వంటివన్నీ కలిపితే నెలకు సగటు ఆదాయం రూ.10,218 ఉంది. కేవలం పంటల సాగునే పరిగణనలోకి తీసుకుంటే సగటు ఆదాయం నెలకు రూ.8,337 మాత్రమే ఉంది.
- రైతులకు ఉన్న అప్పుల్లో 69.6 శాతం బ్యాంకులు, సంఘాల నుంచి తీసుకున్నవి 20.5 శాతం. మిగిలినవారు వడ్డీ వ్యాపారుల వద్ద తెచ్చుకున్నారు.
- రైతు కుటుంబాల్లో 14.2% మంది రోజువారీ కూలీలుగా పనులకు వెళుతున్నారు. ఈ కుటుంబాల్లో 7.7% మంది నెలవారీ జీతాలు పొందే ఉపాధిలో ఉన్నారు.
- గ్రామాల్లో వ్యవసాయేతర కుటుంబాల్లో 48.6 శాతం మంది కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ కుటుంబాల్లో 17.7 శాతం మంది నెలవారీ వేతనం పొందే ఉద్యోగాలు చేస్తున్నారు.

- దేశవ్యాప్తంగా మొత్తం భూముల్లో ఎస్సీల పేరుతో 14.1 శాతం, ఎస్టీలకు 10.2, బీసీల పేరిట 47.2, ఓసీ వర్గాలకు 28.5 శాతం భూమి ఉంది.

**సలహాలిచ్చేది తోటి రైతులే**

పంటల సాగులో ఆధునిక విధానాలపై సాంకేతిక సలహాలను తోటి ఆదర్శ రైతుల నుంచే తీసుకుంటున్నట్లు 91.2 శాతం మంది రైతులు చెప్పారు. పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లు చెప్పినవి 92.4 శాతం మంది పాటిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సమాచారం 73.8 శాతం, కృషి విజ్ఞాన కేంద్రాల సూచనలను పాటించినట్లు 72శాతం, స్మార్ట్‌ఫోన్లయాప్‌లలో లభించే వివరాలను పంటల సాగులో ఉపయోగించినట్లు 62.8 శాతం మంది తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది సమాచారాన్ని వాడుకున్నట్లు 86.2 శాతం రైతులు స్పష్టం చేశారు.

- ప్రతి 100 రైతు కుటుంబాలకు సగటున 21.9 శాతమే పాడి పశువులు, 134 కోళ్ళు ఉన్నాయి.
- గ్రామాల్లో 25 ఎకరాల భూమి ఉన్న వారిని భూస్వామి అంటారు. అలాంటి రైతు కుటుంబం నెల సగటు ఆదాయం రూ.60,758 మాత్రమే.

**గిట్టుబాటు ధర ఏదీ!**

పంటలకు మద్దతు ధర ఇస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా జాతీయ నమూనా సర్వేలో మాత్రం ఎక్కువశాతం మంది తమకు మద్దతు ధర దక్కలేదని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం నిర్వహించే వ్యవసాయ మార్కెట్లలో గానీ, ప్రభుత్వ సంస్థలు ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల్లో గానీ పంటలు అమ్ముతున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది.

2019లో జనవరి నుంచి జూన్ మధ్యలో పంట అమ్మకాలపై సర్వే చేయగా పత్తి పంటను అమ్మిన ప్రతి వెయ్యి మంది రైతుల్లో తెలంగాణలో కేవలం 274 మంది మాత్రమే తమకు సరైన ధర వచ్చిందని సంతృప్తి తెలిపారు. ఏపీలో పెసలు అమ్మిన రైతుల్లో వెయ్యికి 427 మంది మాత్రమే సంతృప్తి చెందారు. దేశవ్యాప్తంగా గిట్టుబాటు ధర రావడం లేదని ఎక్కువ శాతం కర్షకులు చెప్పారు.

(ఈనాడు సౌజన్యంతో) ■

## పుంగనూరు ఆవుపాలు వెన్నలో మిన్న !

(11వ పేజీ తరువాయి)

ఉంటాయి. కొమ్ములు 10–15 సెంటీమీటర్లు పొడవు ఉంటాయి.

**పునరుత్పత్తి లక్షణాలు**

మరుగుజ్జుగా పేరొందిన పుంగనూరు ఆవు 37 నెలల వయస్సులో మొదటి ఈత వేస్తుంది. ఈతల మధ్య 10 నుంచి 27 నెలలు (సగటున 14.9 నెలలు) ఉంటుంది. ఒక ఈతలో పాల దిగుబడి 194–1100 లీటర్లు (సగటున 546 లీటర్లు) ఉంటుంది. పాలలో కొవ్వు సగటున 5 శాతం ఉంటుంది.

**మిషన్ పుంగనూరు**

ఇంతటి విశిష్టత ఉన్న ఆవుజాతి కాలక్రమంలో అంతరించిపోయే దశకు చేరుకున్నది. పరిరక్షించుకోకపోతే ఎంతటి అపురూపమైన పశు జాతైనా కాలగర్భంలో కలిసి పోతుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న పుంగనూరు ఆవుల సంఖ్య కేవలం 300 మాత్రమే. అవి కూడా పుంగనూరు ఆవుల కోసం ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రాల్లో మాత్రమే ఉన్నాయి. మిగిలినవి కొంతమంది ధనవంతుల ఇళ్లలో స్టేటస్ సింబల్‌గా వున్నాయి. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పుంగనూరు ఆవుల పునఃసృష్టికి శ్రీకారం చుట్టింది.

తెలుగు జాతికి మాత్రమే ప్రత్యేకమైన పుంగనూరు ఆవులను తిరిగి బ్రతికించేందుకు 'మిషన్ పుంగనూరు' పేరుతో ఓ బృహత్ యజ్ఞాన్ని ప్రారంభించింది. పుంగనూరు జాతి పశుసంతతి వృద్ధికి రూ.63 కోట్లతో చేపట్టనున్న మిషన్ పుంగనూరు రీసర్చ్ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సహకారంతో కడప జిల్లా పులివెందులలోని 'ఏపి సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసర్చ్ ఆన్ లైవ్ స్టాక్ లిమిటెడ్'లో నాణ్యమైన పుంగనూరు జాతి పశువులను ఉత్పత్తి చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. ■

# కనిగిరిలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై శిక్షణలు

– ఆర్.వై.వి.యస్.వి.భాస్కరరావు

**క**నిగిరి నగర పంచాయితీ, ప్రభుత్వం, యునిసెఫ్, ఏపిమాస్‌ల సహకారంతో కనిగిరి నగర పంచాయితీని ఆదర్శ నగర పంచాయితీగా తీర్చిదిద్దుటలో భాగంగా కమ్యూనిటీ నిర్వహణలో నీరు, పారిశుద్యం, పరిశుభ్రత (వాష్) అంశాలలో ప్రజల ఆలోచనలో, ప్రవర్తనలో మార్పు కొరకు శిక్షణలు నిర్వహించడం జరిగింది. కమ్యూనిటీ నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే నాలుగు ముఖ్యమైన విభాగాలు 1. ప్రజా ప్రతినిధులు (మునిసిపల్ కౌన్సిలర్లు) 2. సంబంధిత సిబ్బంది 3. పట్టణ సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు (టి ఎల్ ఎఫ్ ఇసి) 4. స్లం సమాఖ్య ఆర్ పి లను (ఎస్ ఎల్ ఎఫ్ ఆర్ పి లు) గుర్తించి వారికి 'వాష్' అంశాలపై శిక్షణలు నిర్వహించడం జరిగింది.





ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 80% వ్యాధులు ముఖ్యంగా నీరు, పారిశుధ్యం లోపం వలన వస్తున్నాయని తేలింది. వీటిని దృష్టిలోవుంచుకొని ఈ క్రింది అంశాలపై శిక్షణలు జరిగాయి:

1. నీటి ప్రాముఖ్యత, రక్షిత మంచి నీరు , వివిధ రకాల నీటి వనరులు, నీటి కాలుష్యం గురించి ...

2. పారిశుద్ధ్యం మెరుగుపరుచుటకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో ముఖ్యమైన ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్తను, ప్రమాదకరమైన వ్యర్థాలను వేరు చేయుట. పారిశుధ్య లోపం వలన వచ్చే వ్యాధులు – వాటి నివారణ గురించి ...

3. వ్యక్తిగత పరిశుభ్రతలో పాటించవలసిన పద్ధతులు, అలవాట్లు, ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతిరోజూ భోజనం చేసేముందు, చేసిన తరువాత, ఏవైనా తినుబండారాలను చేతిలోకి తీసుకొని తినేముందు, తిన్న తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కొనుట, మూత్ర విసర్జన, మల విసర్జన తరువాత కచ్చితంగా చేతులను సబ్బుతో కడుక్కొనుట పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర పంచాయితీగా తీర్చి దిద్దడంకోసం పట్టణంలో ఆరుబయట మలవిసర్జన లేకుండా చేయుటకు గాను ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుట గురించి అవగాహన కలిగించుట ...

### కరోనాలో పాటించవలసిన నడవడిపై ప్రచారం

కనిగిరి నగర పంచాయితీలో 'కరోనాలో అనుసరించ వలసిన నడవడి' పై (కోవిడ్ అప్రాప్రియేట్ బిహేవియర్) ప్రజల ఆలోచనలో, ప్రవర్తనలో మార్పు కోసం కమ్యూనిటీలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఎస్ హెచ్ జి, ఎస్ ఎల్ ఎఫ్, టి ఎల్ ఎఫ్, మహిళా సంఘ సభ్యులతో ఎం ఎల్ ఏ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్, నగర పంచాయితీ చైర్మన్ శ్రీ అబ్దుల్‌గఫూర్, మెప్మా సిబ్బంది ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యులను కలసి మాట్లాడారు, బ్యాంకులలో, నిర్మాణ పనుల వద్ద, అంగన్వాడి



కేంద్రాలలో, ప్రాథమిక పాఠశాలలలో,ఎస్ హెచ్ జి, ఎస్ ఎల్ ఎఫ్, టి ఎల్ ఎఫ్, మహిళాసంఘ సమావేశాలలో ప్రచారం నిర్వహించారు. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, శానిటైజర్స్ వాడాలని, మాస్క్ ధరించాలని, బహిరంగ ప్రదేశాలలో సామాజిక దూరం పాటించాలని, అర్హతకలిగిన ప్రతి ఒక్కరు వాక్సిన్ వేసుకొవాలని ప్రచారం చేశారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులవంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, చేతుల పరిశుభ్రతకై ప్రతిజ్ఞ కరపత్రం తయారుచేసి పంచి పెట్టాలని సంకల్పించారు.

ఈ ప్రచారంలో పాల్గొన్న కమిషనర్ శ్రీ డి.వి.యస్. నారాయణరావు, చైర్మన్ శ్రీ అబ్దుల్ గఫూర్, ఏపిమాస్ మేనేజర్ శ్రీ కే. శ్రీనివాస్, ఏపిమాస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ ఆర్. భాస్కరరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీ కే.రఘు, సి ఓ శ్రీమతి సురత్న,సి ఎల్ ఆర్ పి శ్రీమతి దీప్తి, ఎస్ ఎల్ ఎఫ్ ఆర్ పి లు, శానిటరీ ఇన్‌సస్పెక్టర్ శ్రీ బి.చెన్నకేశవులు, ప్రకాశంజిల్లా ఎస్ బి సి సి కోఆర్డినేటర్ శ్రీ కిరణ్ కుమార్, శ్రీ రమేష్ బాబు డైరెక్టర్, గుడ్ హెల్ప్ ఎన్ జి ఓ ,శ్రీ నవకుమార్ పాల్గొని ప్రచారం నిర్వహించారు.



■

## తక్కువ వడ్డీకే రుణం !

**మీ** ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ నుంచి వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. కానీ, పర్సనల్ లోన్‌పై 11 శాతం నుంచి 18 శాతం స్థాయిలో వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు, ఇతర చార్జీలు అదనం. కొన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఫిన్‌టెక్ కంపెనీలతో కలిసి డిజిటల్ రుణాలు కూడా ఆఫర్ చేస్తున్నాయి. తక్షణమే సొమ్ము చేతికొచ్చే అవకాశమున్నప్పటికీ.. అధిక ప్రాసెసింగ్ చార్జీలు, తిరిగి చెల్లింపులు కాస్త జాప్యమైనా భారీ పెనాల్టీలు భరించేందుకు సిద్ధంగా ఉండాలి. తక్కువ వడ్డీకే సత్వరం రుణం పొందేందుకు కొన్ని ప్రత్యామ్నాయాలున్నాయి. ఆ వివరాలు..

**జీతంపై ఓడీ**

ఒకవేళ మీరు వేతన జీవులైతే, మీ జీతంపై ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ) పొందవచ్చు. మీ జీతంపై మూడు రెట్ల వరకు ఓడీ, ఏడాది కాలం పాటు లభించే అవకాశం ఉంటుంది. ఈ వసతిలో మీరు వాడుకున్న ఓడీ సొమ్ముకు, వాడుకున్న కాలానికి మాత్రమే వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. ఇది నాన్–ఈఎంఐ ఆఫర్. ప్రతినెలా వడ్డీ కడితే సరిపోతుంది. ఓడీ వసతిని మధ్యలో ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. అదీ ఎలాంటి పెనాల్టీ లేదా చార్జీలు లేకుండానే.

**ఎఫ్‌డీపై రుణం**

మీకుగానీ, మీ కుటుంబ సభ్యులకు గానీ ఏదేని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఉంటే గనుక దానిపై రుణం తీసుకోవచ్చు. వెంటనే మంజూరవుతుంది కూడా. సాధారణంగా, ఎఫ్‌డీ సొమ్ములో 85–90 శాతం వరకు రుణం లేదా ఓడీ రూపంలో పొందవచ్చు.

**మ్యూచువల్ ఫండ్ లోన్**

కొన్నిబ్యాంక్‌లు డెట్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోని పెట్టుబడుల తనఖాపైనా రుణాలు ఆఫర్ చేస్తున్నాయి. ఇది ఓడీ తరహా రుణం. అంటే, మంజూరైన రుణంలో వాడుకున్న సొమ్ముకు వడ్డీచెల్లిస్తే సరిపోతుంది. మీరు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయని పక్షంలో బంగారు ఆభరణాలు, బీమా పాలసీ లేదా ప్రాపర్టీ తాకట్టు పైనా రుణం తీసుకోవచ్చు. ■

# చిన్నకారు రైతుకు అండగా సీహెచ్‌సీలు

## ఫోన్ చేస్తే పొలం వద్దకే యంత్రం ... సింగరేణి సీహెచ్‌సీకి జాతీయస్థాయిలో గుర్తింపు

**రా**ష్ట్రంలో సన్న, చిన్నకారు రైతులకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) అండగా నిలుస్తున్నాయి. వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసుకునే సామర్థ్యంలేని రైతులకు వీటిద్వారా తక్కువ అద్దెకే వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందుతున్నాయి. ఈ సేవలు అందించడంలో ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని సీహెచ్‌సీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. వ్యవసాయంలో యాంత్రీకరణ బాగా పెరిగింది. వీటిద్వారా పనులు సులభతరం కావడంతోపాటు, కూలీల కొరత తీరుతున్నది. అయితే, రాష్ట్రంలో 95 శాతానికిపైగా సన్న, చిన్నకారు రైతులు ఉండటంతో వారు వ్యవసాయ పరికరాలు, యంత్రాలను కొనుగోలు చేయలేక పోతున్నారు. అలాంటి రైతుల కోసం ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా 'ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ'ల (ఎఫ్ పి సి ల) ఆధ్వర్యంలో సీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తున్నది. ఈ కేంద్రాల ద్వారా వ్యవసాయ పరికరాలు, యంత్రాలను రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇస్తున్నారు. సెంటర్లకు ఫోన్‌చేస్తే పొలం వద్దకే యంత్రాన్ని చేరుస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సాగయ్యే పంటలకు అనుగుణంగా యంత్రాలు అందుబాటులో ఉంటున్నాయి.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద మహిళలు విజయవంతంగా నడిపిస్తున్న వాటిలో దేశవ్యాప్తంగా 75 కార్యక్రమాలను ఎంపిక చేయగా అందులో తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలంలోని సీహెచ్‌సీ ఎంపికయింది. మరో కేటగిరిలో రంగారెడ్డి జిల్లాలోని అనంతగిరి విలేజ్ లెవల్ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్‌కు కూడా స్థానం దక్కింది.

**మరో 100 కేంద్రాల ఏర్పాటు దిశగా....**

తెలంగాణా రాష్ట్రంలో ఇప్పటివరకు 52 సీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయి. వీటిలో 32 సీహెచ్‌సీలను పూర్తిగ్రాంట్‌గా రూ.8.10 కోట్లతో, 20 కేంద్రాలను రూ.3.53 కోట్లతో స్త్రీనిధి, బ్యాంకుల రుణ సహాయంతో ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా 2021-22లో 25% గ్రాంట్‌తో 100 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన 75 శాతాన్ని రూర్బన్ ద్వారా కానీ, ట్రైకార్ సంస్థ, పీఎంకేఎస్‌వై, స్త్రీనిధి సంస్థల ద్వారాకానీ నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది.



**అందుబాటులో ఆధునిక యంత్రాలు**

రైతుల నుంచి మంచి స్పందన రావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త యంత్రాలు, పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. ట్రాక్టర్, కల్టివేటర్, హార్వెస్టర్, కలుపు తీసే యంత్రాలు, గడ్డి కట్టలు కట్టే యంత్రం, రీపర్, నూర్పిడి పరికరాలు, రోటోవేటర్, స్ప్రేయర్లు ఇలా రకరకాల పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. ముందే బుక్ చేసుకునే వెసులుబాటు కూడా ఉన్నది. రైతులు ఫోన్ చేస్తే రైతు పొలం వద్దకే యంత్రాన్ని చేరుస్తారు. గ్రామంలో వీవోఏ లేదా సీసీల ద్వారా రైతులు సమాచారం అందించవచ్చు. ఎఫ్‌పీసీలను బలోపేతం చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన వీటి నిర్వహణకు సెర్ప్ అధికారులు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రైతులు అద్దెను ఒకేసారి చెల్లించే స్థాయి లేకుంటే ముందుగా కొద్దిమొత్తం చెల్లించి.. మిగిలినది పంట దిగుబడి వచ్చాక చెల్లించే వెసులుబాటు కూడా కల్పించారు.

### రైతులకు ఉపయోగం



సీహెచ్‌సీలు రైతులకు మంచిగా ఉపయోగపడు తున్నాయి. ఏడాదిగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. రైతులు అడిగిన వెంటనే యంత్రాలను పంపిస్తు న్నాం. తక్కువ ధరకు అద్దెకిచ్చినా మంచి లాభాలే వస్తున్నాయి. యంత్రాల కోసం షెడ్డు నిర్మిస్తున్నాం. సీజన్‌లో డ్రైవర్లను పెట్టుకుంటున్నాం.

*వడ్డె మాధవి, విశ్వనాథపల్లి, సింగరేణి మండలం,*

### తక్కువకే అద్దెకిస్తున్నాం



ఎఫ్‌పీసీ ద్వారా విత్తనాలు, ఎరువు లు సరఫరా చేస్తున్నారు. బెనిషాన్ ద్వారా పండించిన పంటల ను కొనుగోలు చేస్తున్నారు. అవసరమైన యంత్రాలను సీహెచ్‌సీ ద్వారా తక్కువ ధరకు ఇస్తున్నారు. ఇంతకంటే రైతుకు ఏం కావాలి? 15 రోజులకోసారి సమావేశం పెట్టి యంత్రాలను ఉపయోగించుకోవడంపై వివరిస్తున్నాం.

*పట్లోల్ల స్వరూపరాణి, అమ్రదికుర్ద్, మోమిన్‌పేట మండలం, వికారాబాద్*

### సిరిధాన్యాలకు యంత్రాలు



రైతులకు అవసరమైన 20 రకాల పరికరాలను అందుబాటులో ఉంచాం. సాధారణ పంటలతో పాటు సిరి ధాన్యాలకు ప్రత్యేక యంత్రాలను కొన్నాం. యంత్రాలను ఉంచేందుకు అనంతగిరి రైతు సేవాకేంద్రంలో షెడ్డు నిర్మించాం. ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు పీఎంకేఎస్‌వై నుంచి కలెక్టర్ కేటాయించారు.

*– ఎస్ శ్రీనివాస్, డీపీఎం, వికారాబాద్ జిల్లా*

## బంగాళాదుంప సాగులో మెలకువలు

చిత్తూరు జిల్లా వి కోట మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా విత్తన బంగాళాదుంప అమ్మకం కౌంటర్‌ను ఉద్యాన అధికారి శ్రీనివాసులురెడ్డి ఇటీవల సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది మహేంద్ర సంవృద్ధి కంపెనీ చే టిష్యూ కల్చర్ పద్ధతిలో ప్రవర్ధన చేసి



ధృవీకరించిన విత్తన బంగాళాదుంపలను మండల వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకారసంఘం సమన్వయంతో అమ్మకాలు చేపట్టడానికి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మంచి మొలకలశాతం నుండి ఎటువంటి చీడపీడలు లేనటువంటి 30, 40 గ్రాముల బరువు కలిగిన దుంపలను విత్తన దుంపలుగా ఎన్నుకోవాలన్నారు. నాటే ముందు దుంపలను మొటాలాక్షిన్ లేదా మాంకోజెబ్ అనే రసాయనం లేదా ట్రైకోడెర్మా లాంటి జీవ నియంత్రికాలతో విత్తన శుద్ధి చేయడం ద్వారా నేలద్వారా శిలీంద్రరోగాల నుండి బంగాళదుంపలను కాపాడుకోవచ్చునన్నారు. ఎత్తు మడులను ఏర్పాటు చేసుకుని, ఈ దుంపలను నాటుకోవాలన్నారు. మురుగునీటి సౌకర్యం కొరకు కాలువలను ఏర్పాటు చేసి నీరు నిల్వకుండా చేయాలన్నారు. దుంపలు నాటేముందు పది టన్నుల కుళ్ళిన పశువుల ఎరువులతో పాటు 165 కిలోల యూరియా, 155 కిలోల సూపర్ ఫాస్ఫరస్, 40 కిలోల పోషక ఎరువులను అందివ్వాలని, సిఫార్స్ చేసిన పూర్తి భాస్వరం, పొటాష్‌లను దుంపలు నాటే ముందు దుక్కిలో వేసి కలియదున్నారు. నత్రజని మూడు సమభాగాలకు చేసి నాటిన 35 రోజుల నుండి 75 రోజులకు వేసి గడ్డపై మట్టిని ఎగద్రోయాలన్నారు. ఈవిధంగా చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఏపిమాస్ ప్రతినిధి అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు. ■

మితమైన ఆహారం దేహానికి మేలు, మితంగా నీటి వాడకం దేశానికి మేలు

# సాధించి సత్తాచాటిన ముగ్గురు మహిళలు !

**ద**శాబ్దాలుగా ఊరు ఎదురు చూస్తున్న వరాన్ని సాధించింది బిందు. వందేళ్ళ ఉస్మానియా చరిత్రలో తనకో ప్రత్యేకతని సొంతం చేసుకున్నారు గుమ్మడి అనూరాధ... ప్రపంచానికి డిజైనర్స్ హబ్‌గా పేరొందిన సింగపూర్‌కి అందాల భామగా ఎంపికైంది మన సిక్కోలు అమ్మాయి నందిత... వీళ్ళు ముగ్గురూ చెబుతోందొకటే... మనం సాధించగలం...అని! ఈ ముగ్గురూ 'వసుంధర'తో పంచుకున్న విశేషాలను 'ఈనాడు' పత్రిక ప్రచురించింది. ఆ పత్రిక సౌజన్యంతో ఆ విశేషాలను 'మహిళా సాధికారత' పాఠకులకోసం అందిస్తున్నాం.

**ఊరికి రోడ్డుకోసం పెళ్ళి మానుకుంటానన్న బిందు !**

**70** ఏళ్ళుగా ఎవరూ చేయలేని పనిని ఓ ఆడపిల్ల చేసింది. ఇందుకు తన పెళ్ళినే వాయిదా వేసుకుంది... ముఖ్యమంత్రినీ కదిలించింది. అనుకున్నది సాధించిన బిందు తమ ఊరి కష్టాల్ని యిలా తెలియజేసింది ...

మాది కర్ణాటకలోని దావణగెరె జిల్లాకు 37కి.మీల దూరంలోని హెచ్.రాంపుర. ఊళ్ళో 60 కుటుంబాలు, జనాభా మూడొందలకు మించదు. మా ఊరి పిల్లను చేసుకోవాలన్నా, మా ఊరికి ఆడపిల్లను ఇవ్వాలన్నా భయం.



కారణం రోడ్డే. తాతలకాలం నుంచీ మాకు మట్టిరోడ్డే తెలుసు. దీనివల్లనే నా స్నేహితురాళ్ళలో చాలామంది పెళ్ళిచూపులకే పరిమితమయ్యారు. బయట ఊళ్ళకు వెళ్లిన వాళ్ళు సాయంత్రం 6 గంటల లోపు ఇంటికి చేరాల్సిందే. కారణం వన్యమృగాలే కాదు, గుంతల రోడ్డులో పడితే ఆస్పత్రే గతి. ఈ భయంతోనే నన్ను బడికి వద్దన్నారు. మా ఊళ్ళో ఐదు వరకే ఉంది. ఆపై చదువుల కోసం మరో ఊరికి వెళ్ళాలి. నేను పట్టుబట్టడంతో హాస్టల్‌లో ఉంచి చదివించారు. అలా దావణగెరె విశ్వవిద్యాలయంలో ఎకానమిక్స్‌లో పీజీ చేశా. నాతో పాటు ఆరో తరగతిలో చేరిన మా ఊరి ఆడపిల్లల్లో ఒక్కరూ పది దాటలేదు. ఎంత మంది నాయకులకు మా కష్టాలను చెప్పినా, హామీలే తప్ప పరిష్కారం దొరకలేదు.

నాకు పెళ్ళి కుదిరింది. చదువుకున్న నేను కూడా నా దారి నేను చూసుకుని వెళ్తే ఊరి పరిస్థితి మారదని తెలుసు. అందుకే పెళ్ళి వాయిదా వేసుకున్నా. గతేడాది రోడ్డు కోసం జిల్లా చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశా. లేఖకు సమాధానం వచ్చినా తారు రోడ్డుకు నిధులు రాలేదు. ఏవో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నా.

కొత్త సీఎం బసవరాజ బొమ్మై మా పక్క జిల్లా వాసి అని తెలిసి ఆయనకు మెయిల్ పెట్టా. ప్రధాని కార్యాలయానికీ కాపీ పెట్టా. మా బాధలన్నీ చెప్పా. నాకు పెళ్ళి కుదిరింది. కానీ మిగిలిన ఆడపిల్లల పరిస్థితి ఏంటి? రోడ్డు వేసేదాకా పెళ్ళే చేసుకోనని తెగేసి ఆ మెయిల్‌లో చెప్పా. ఆ మెయిల్ చూసిన వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి 'మీ ఊరికి త్వరలో అధికారుల బృందం వస్తుంద'ని సమాధానం పంపారు. అన్నట్టుగానే మూడురోజులకే జిల్లా అధికారి మహంతేశ్ ఇంజినీర్ల బృందంతో మా ఊరికొచ్చిన తర్వాత రోడ్డు పనులు మొదలయ్యాయి. త్వరలో తారురోడ్డు వేస్తామన్నారు, బస్సు కూడా వస్తుందన్నారు. నా పెళ్ళికూడా చేస్తామని అన్నారు. చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే మా ఊరి, అమ్మాయిల పెళ్ళిళ్ళ కష్టాలు తప్పాయి.

**న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆదివాసీ మహిళ !**



**తం**డ్రి ఎమ్మెల్యే అయినా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలోనే చదివారామె. విద్యార్థి నేతగా ఉద్యమాలు చేస్తూనే.. లా చేశారు. చిన్న వయసులోనే న్యాయకళాశాల ప్రిన్సిపల్ అయి వందేళ్ళ ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రలో రికార్డు సాధించారు. తెలుగునాట ఇలా ఎంపికైన తొలి ఆదివాసీ మహిళగానూ ప్రత్యేకతని సాధించిన గుమ్మడి అనూరాధ తన జీవనయానాన్ని గురించి యిలా వివరించారు...

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులగూడెం. మూడో తరగతి వరకు మా ఊళ్ళో, ఆపై ఇంటర్‌వరకు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివా. మా సామాజికవర్గంలో పెద్ద చదువులు తక్కువ. అందుకే ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించేవారు. బాగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పేవారు. ఆ మాటలు నాలో బలంగా నాటుకున్నాయి. నాన్న గుమ్మడి నర్సయ్య. ఇల్లెందు నియోజకవర్గానికి ఐదు సార్లు ఎమ్మెల్యే. మేం నలుగురం. నేను చిన్నదాన్ని. రాజకీయాల్లో నాన్న బిజీ. ఆయన మాతో గడపడం లేదన్న లోటు తెలియకుండా అమ్మ చూసుకునేది. తనే వ్యవసాయం చేసేది.

ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో కూడా మమ్మల్నేమీ ప్రత్యేకంగా చూసేవారుకాదు. నాన్న స్ఫూర్తితో సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారినై ప్రజల సమస్యలు పరిష్కరించవచ్చను కున్నా. కానీ గణితంపై ఆసక్తితో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీలో చేరా. ఇమడలేక రెసిడెన్షియల్ స్కూల్‌లోనే చేరా.

నాన్నకు నన్ను లాయర్, అక్కను డాక్టర్ చేయాలని ఉండేది. అందుకే 2006లో ఉస్మానియాలో ఎల్‌ఎల్‌బీలో చేరా. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూనే లా చదివాను. సివిల్స్ రెండుసార్లు రాసినా రాలేదు. బషీర్‌బాగ్ న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం చేశా. ఎమ్మే ఫిలాసఫీ కూడా చదివా. 2017లో పీహెచ్‌డీలో పూర్తి చేయగానే వర్సిటీలోని లా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాతే నాన్నకు ద్విచక్ర వాహనం, కారు కొనిచ్చాను. ఆయనకంటూ ఆస్తులేవీ లేవన్న ఉద్దేశంతో ఇల్లు కొన్నా. కానీ ఆయన మాత్రం సొంతూరిలోనే ఉండేందుకు ఇష్టపడుతున్నారు.

**ఉద్యమాల్లోనూ...** నేను ఇంటర్‌లో ఉండగా మా పాఠశాలలో 5వ తరగతి అమ్మాయికి జ్వరం వచ్చింది. వైద్య నిర్లక్ష్యం కారణంగా ఆ పిల్ల చనిపోయింది. తోటి విద్యార్థులతో కలిసి ఆ బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్యమంచేసి సఫలీకృతులమయ్యాం. డిగ్రీలో నన్ను పీడీఎస్‌యూ కమిటీలోకి తీసుకున్నారు. అటు ఉద్యమాలు.. ఇటు చదువు... కష్టమయ్యేది. చదువుపై దృష్టి పెట్టలేక పోయాను. నాన్నకు చెబితే సమన్వయం చేసుకో అన్నారే కానీ ఉద్యమాలొద్దని చెప్పలేదు. పీడీఎస్‌యూలో ఓయూ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పని చేశాను. నేను చదువుకున్న కాలేజీకే ప్రిన్సిపాల్‌గా రావడం సంతోషంగా ఉంది.

**అందాల సుందరి బహుముఖ వ్యక్తిత్వం!**

**ఏం** చేసినా అవగాహనతో పాటు ఆసక్తీ ఉండాలని అంటోంది నందితా బన్నా. ఇటీవల జరిగిన మిస్ సింగపూర్ పోటీల్లో విజేతగా నిలిచింది తను. త్వరలో మిస్ యూనివర్స్ పోటీల్లో సింగపూర్ తరఫున బరిలోకి దిగనున్న నందిత అచ్చ తెలుగమ్మాయి. అక్కడే పుట్టి, పెరిగినా మేం తెలుగు వాళ్ళమేనంటూ తన విశేషాలను యిలా వివరించింది.

అందాల పోటీలంటే ఒకప్పుడు బాహ్య సౌందర్యానికే ప్రాధాన్యముండేది. కానీ ఇప్పుడు న్యాయనిర్ణేతలు పరిశీలించే తీరులో మార్పొచ్చింది. ఎన్నో అంశాలపై పూర్తి అవగాహన, ఆసక్తి రెండూ ఉండాలి. అప్పుడే చేసే పని, చెప్పే మాటలో సహజత్వం ఉంటుంది. ఈ తీరే నన్ను మిస్ సింగపూర్‌గా

# 'బ్లాక్‌చైన్'తో కావలసినన్ని విత్తనాలు, ఎరువులు!

ఏటా వ్యవసాయ సీజన్ వచ్చిందంటే ఎరువులు, విత్తనాలకోసం రైతులు ఇబ్బందులు పడుతుంటారు. డిమాండ్ తెలియక ఉత్పత్తిదారులు అవసరానికి కంటే తక్కువగానో, ఎక్కువగానో ఉత్పత్తి చేస్తుంటారు. ఫలితంగా రైతులతో పాటు ఉత్పత్తి చేసే కంపెనీలు ఆర్థికంగా నష్ట పోతుంటాయి. దీన్ని నివారించడానికి సీజన్‌కు తగ్గట్టుగా రైతుల అవసరాలమేరకు ఉత్పత్తిచేసి నేరుగా వారికే చేరవేసేం దుకు వీలుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థను రూపొందించారు.

బ్లాక్‌చైన్ సాంకేతికతను ఉపయోగించుకుని 'ఇన్‌క్లూజివ్ గ్రోత్ చైన్' పేరిట వెబ్ అప్లికేషన్ తయారు చేశారు. ఇది పూర్తిగా రైతులు, ముడిసరకు సరఫరాదారులు, కొనుగోలు దారులతో అనుసంధానమై ఉంటుంది. హెచ్‌సీయూ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యుడు ప్రొ. విజయభాస్కర్ మరిశెట్టి, మరో ఆచార్యురాలు ప్రొ. వర్ష మామిడి సంయుక్తంగా సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఇందుకు సింక్రొనీ ఐటీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు అందించింది.

**ఎలా పనిచేస్తుందంటే..!**

సాధారణంగా ఒక ప్రాంతంలో రైతులు కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేసుకుంటారు. ఇందులోని సభ్యులు మరుసటి సీజన్‌కు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వంటివి నేరుగా యాప్‌లో తమ మాతృభాషలోనే నమోదు చేసే వీలుంటుంది. ఎఫ్‌పీవో పరిధిలో ఉన్న రైతుల అవసరాలను క్రోడీకరించి సీజన్‌కు అవసరమైన మేరకు నేరుగా కంపెనీలకు ఆర్డర్ వెళుతుంది. తదనుగుణంగా కంపెనీలు ఉత్పత్తి చేస్తాయి. మధ్యవర్తుల ప్రమేయం ఉండదు కనుక తక్కువ ధరకే

---

నిలిపింది. నా పూర్తి పేరు బన్నా ప్రభాక్రాంతి నందిత. మాది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం. అమ్మ ఫణిమాధురి, నాన్న గోవర్ధనరావు. ఇద్దరూ సివిల్ ఇంజినీర్లే. పాతికేళ్ళ క్రితమే సింగపూర్‌లో స్థిరపడ్డారు. నాకో తమ్ముడు. నేను పుట్టిందీ, పెరిగిందీ సింగపూర్‌లోనే. స్కూల్లో ఆంగ్లం మాట్లాడినా ఇంట్లో అందరం చక్కగా తెలుగే మాట్లాడతాం. సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీలో డబుల్ డిగ్రీ మూడో ఏడాది చదువుతున్నా. హైస్కూలు నుంచి ఫ్యాషన్ రంగమంటే ఇష్టం. స్టూడెంట్ డిజైనర్లు, ఫొటోగ్రాఫర్లు, స్కూల్ క్లబ్, భారతీయ సాంస్కృతిక బృందాలతో కలిసి పని చేయడంతో మోడలింగ్‌పై ఆసక్తి కలిగింది. అలాగని చదువుని నిర్లక్ష్యం చేయలేదు. స్కూలు నుంచి కాలేజ్‌స్థాయి వరకు నావన్నీ మంచి గ్రేడ్‌లే. సాంకేతికత అన్నా మక్కువే. డేటాసైన్స్, పైథాన్, మెషింగ్ లెర్నింగ్ కోర్సులను పూర్తిచేశా. సేవా కార్యక్రమాలన్నా ఆసక్తే.



పేద పిల్లలకు దాతల నుంచి వస్తువులను సేకరించి అందిస్తా. దీన్ని హైస్కూల్ నుంచి నిర్వహిస్తున్నా. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమా ల్లోనూ పాల్గొంటా. ఒంటరి తల్లుల గురించి దృష్టి పెట్టడం అవసరం. వీరి స్థితిగతుల సమా చారాన్ని ఎప్పటికప్పుడు మా బృందం సింగపూర్ ప్రభుత్వానికి అందిస్తోంది. వీటి ఆధారంగా పార్లమెంట్‌లో చర్చించారుకూడా. 'కేర్ కార్నర్ సింగపూర్'లో వలంటీర్‌ని. ప్రైమరీ స్కూలు విద్యార్థులకు మెంటార్‌ని కూడా. వారికి ఇంటర్ పర్సనల్, లైఫ్‌స్కిల్స్‌లో శిక్షణ నిస్తుంటా. ఫ్యాషన్ రంగంలోనే స్థిరపడాలన్న నియమాన్నీ పెట్టుకోలేదు. ఇప్పుడైతే విద్య, ఫ్యాషన్ రెంటికీ సమ ప్రాధాన్యమిస్తున్నా. మిస్ యూనివర్స్ పోటీలు ఈ డిసెంబర్‌లో ఇజ్రాయెల్‌లో జరుగనున్నాయి. వాటికీ సిద్ధమవుతున్నా. అక్కడా విజయం సాధించేందుకు శ్రమిస్తా.

(ఈనాడు సౌజన్యంతో) ■

# జి ఐ జడ్ బృందంచే ఎఫ్ పి ఓల పనితీరు సమీక్ష

– ఎస్ ప్రహల్లాద

**జ**ర్మనీకి చెందిన జి ఐ జడ్ సంస్థ సహకారంతో చిత్తూరు జిల్లాలో ఏర్పాటుచేసిన రైతు ఉత్పత్తిదారు సంస్థల (ఎఫ్ పి ఓ ల) తీరుతెన్నులపై జి.ఐ.జడ్. సంస్థ ఇటీవల ఒక అధ్యయనాన్ని నిర్వహించింది.



కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు నగరంలో ప్రసిద్ధమైన 'ఉత్సాన్ లాబ్స్' సంస్థ సంచాలకులుఇ ఎఫ్ పి ఓ ల కార్యకలాపాలపై అపార అనుభవం వున్న శ్రీ నవీన్ కుమార్, ఆయన బృందం చిత్తూరు జిల్లాలో నాలుగు రోజుల పాటు పర్యటించి 8 రైతు ఉత్పత్తిదారు సంస్థలను సందర్శించి, వాటి కార్యవర్గ సభ్యులతో చర్చించి, వారి కార్యక్రమాలను తెలుసుకొని సంస్థల పనితీరును మదింపు చేసింది.

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థలోను శ్రీ నవీన్‌కుమార్ తమదైన శైలిలో వివిధ అంశాలపై సమాచారాన్ని రాబట్టారు. సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాలను, ఆడిట్ నివేదికలను, వ్యాపార ప్రణాళికలను, ప్రగతి నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమీక్షలో ప్రతి ఎఫ్‌పిఓ కార్యవర్గ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని, సమీక్షా బృందంతో తమ సంస్థల కార్యక్రమాలను గురించి వివరించి, వాటి సమగ్ర



అభ్యున్నతికి భవిష్యత్‌లో చేపట్టవలసిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

సమీక్షా బృందం తమ సంస్థ అభివృద్ధికి మంచి సలహాలు ఇచ్చారని సంతోషించి, వాల్మీకిపురం ఎఫ్‌పిఓ కార్యవర్గ సభ్యులు శ్రీ నవీన్ కుమార్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. త్వరలో పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని సమీక్షా బృందం వారు తెలిపారు. ■

---

లభిస్తాయి. ఈ వేదికలో కొనుగోలుదారులు భాగస్వాములు కావడంతో నేరుగా పంటను వారికి విక్రయించే అవకాశం దక్కుతుంది. తద్వారా రైతులకు ప్రయోజనముంటుంది.

**వచ్చే నెలలో కామారెడ్డిలో అమలు**

ఇన్‌క్లూజివ్ గ్రోత్ చైన్ సాంకేతికతను ప్రయోగాత్మకంగా సెప్టెంబర్ 15 నుంచి తమిళనాడులో అమల్లోకి తీసు కొచ్చారు. సమున్నతి సంస్థ భాగస్వామ్యంతో తమిళనాడు లోని సీడ్స్ ఎఫ్‌పీఓలో అమలు చేస్తున్నారు. వచ్చే నెలలో తెలంగాణాలోని కామారెడ్డి జిల్లా రైతులకు ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఇక్కడ ఇ–ఫ్రెష్ కంపెనీ రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ అందించేందుకు ముందుకు రాగా పంట ఉత్పత్తుల కొనుగోలుకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆసక్తి చూపించింది. రైతులు తమకు అవసరమైన వనరులను టోకెన్ వ్యవస్థ (క్రిప్టో కరెన్సీ) సాయంతో కొనుగోలు చేసే వీలు కల్పిస్తున్నామని ప్రొ.విజయభాస్కర్ వివరించారు. ■

# రైతులకోసం కెవికె అగ్రిటెక్ ఎటిపి మొబైల్ యాప్!

అనంతపురం జిల్లా రెడ్డిపల్లిలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్తలు రైతులకోసం నాబార్డు నిధుల సహకారంతో రైతులకు ఉపయోగపడే ఒక మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈ మొబైల్ యాప్ పేరు “కెవికె అగ్రిటెక్–ఎటిపి (KVK AgriTech-ATP). అన్ని రకాల పంటల పూర్తి యాజమాన్య పద్ధతులను, వివిధ రకాల పశుపోషణ యాజమాన్య పద్ధతులను రైతులకు కేవలం ఫోన్‌ను ఒక్కసారి నొక్కితే చాలు తెలిసే విధంగా ఈ మొబైల్ యాప్‌ను రూపొందించారు. సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీషు భాషలలో సులభంగా అర్థం చేసు కొనేందుకు వీలుగా ఈ మొబైల్ యాప్‌ను ఫోటోలతో సహా రూపొందించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా లోని రైతులతో పాటు దేశమంతా ఉన్న రైతులకు ఉపయోగపడాలని ఇంగ్లీషులో కూడా రూపొందిచారు.

ఈ మొబైల్ యాప్‌ను జులై 31 వ తేదీన జరిగిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ శంకర్ నారాయణ, జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి గారి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించారు. ఇప్పుడు రైతులందరికీ అందుబాటులో గూగుల్ ప్లే స్టోర్ లో కెవికె అగ్రిటెక్–ఎటిపి (KVK AgriTech-ATP) పేరుతో అందుబాటులో ఉంచారు.


ఈ యాప్ ద్వారా రైతులు తక్కువ సమయంలో, వారి ఫోన్ ద్వారా నేరుగా వ్యవసాయ, అనుబంధ రంగాల పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ఈ రంగాలలో రైతులు ఎదురుకొంటున్న సమస్యలను ఈ యాప్ ద్వారా శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకోవచ్చని కెవికె ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం.జాన్సన్ తెలిపారు.

కెవికె అగ్రిటెక్ – ఎటిపి యాప్‌ను కెవికె శాస్త్రవేత్త డా. ఎం. రవికిషోర్ రూపొందించారు. ఈ యాప్ ఉపయోగాలను ఈ క్రింద తెలుసుకోవచ్చు.

**కెవికె అగ్రిటెక్ – ఎటిపి యాప్ ముఖ్య ప్రయోజనాలు**

- కెవికె వ్యవసాయ క్షేత్రం, భూసార పరీక్షా కేంద్రం, కెవికెలో అందించే సేవలు, కెవికెలోని ప్రదర్శనా క్షేత్రాలు, వ్యవసాయ శిక్షణ క్యాలెండర్ మొదలైన వివరాలను ఈ యాప్‌లో పొందుపరిచారు. కెవికెలో అందుబాటులో ఉన్న విత్తన వివరాలు, అద్దెకు అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్రాల వివరాలను, కెవికె, రెడ్డిపల్లిలో అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- విత్తిన దగ్గర నుండి కోత కోసేవరకు మన తెలుగు రాష్ట్రాల్లో పండిస్తున్న ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటల పూర్తి సమాచారం ఈ యాప్‌లో పొందుపరిచారు.
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ళు, పురుగుల వ్యాధి నిర్ధారణపై సమాచారం, ఏ మందు పిచికారీ చేయాలి, మార్కెట్లో ఏ కంపెనీ పేరుతో అందుబాటులో వున్నాయి, ఎంత మోతాదు పిచికారీ చేయాలి వంటి వివరాలను తెలుసుకోవచ్చు.
- పశువుల పెంపకం, పశుపోషణ అంశాలపై సమాచారం, వివిధ రకాల కోళ్ళ పెంపకం, గొర్రెల పెంపకం, మేకల పెంపకం, కుందేళ్ళ పెంపకం, చేపల పెంపకం, అజోల్లా పెంపకం, సైలేజి తయారీ, గడ్డి విత్తనాల రకాలు, వాటి పెంపకం వంటి మొత్తం సమాచారాన్ని తెలుసుకోవచ్చు.
- ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటలలో కలుపు నిర్వహణ, కలుపు మందుల లభ్యత, మోతాదు వంటి వివరాలను పొందుపరిచారు.
- వ్యవసాయం , అనుబంధ రంగాలలో ఉపయోగిస్తున్న

ప్రకృతి అందరి అవసరాలను తీర్చగలదు, కాని కొందరి అత్యాశను తీర్చలేదు





వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వాటి లభ్యత సమాచారం,

- ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ వై.ఎస్. అర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, తెలంగాణా లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, తెలంగాణా పశు వైద్య విశ్వవిద్యాలయాలకు చెందిన కళాశాలలు, పరిశోధనా కేంద్రాలు, కెవికెలు, డాట్ కేంద్రాల పూర్తి చిరునామాలు, వివరాలను పొందుపరిచారు.
- రైతుల ప్రయోజనాల కోసం వివిధ వ్యవసాయ సమాచార వనరులు, వ్యవసాయ పత్రికలు, వార్తా లేఖలు, ప్రముఖ కథనాలు, వ్యవసాయ టీవీ కార్యక్రమాలు, వ్యవసాయం, అనుబంధ రంగాల సమాచారాన్ని అందించే టోల్ ఫ్రీ నంబర్ల వివరాలు వున్నాయి.
- వ్యవసాయం, అనుబంధ రంగాలలో ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, పోషకాహారం వివరాలు, అగ్రిబిజినెస్ అవకాశాలు, నమూనా బ్యాంకు ప్రాజెక్ట్‌ను పొందుపరిచారు.
- వ్యవసాయ వాతావరణ సమాచారం, వాతావరణానికి అనుగుణంగా వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఈ యాప్ వివరిస్తుంది.
- రైతులు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన ఎటువంటి సమస్యకైనా ప్రశ్నల ద్వారా శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చు. నిపుణుల నుండి తక్షణ పరిష్కారాలను పొందవచ్చు.
- దేశవ్యాప్తంగా చోటుచేసుకునే వివిధ వ్యవసాయ, అనుబంధ రంగాల వార్తలు, సంఘటనలను గురించి తెలుసుకోవచ్చు.

ఈ యాప్ ను పూర్తిగా ఉచితంగా గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ను ఈ క్రింది లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

https://play.google.com/store/apps/details?id=org.kvkagriatp.kvkagriapp

లేదా గూగుల్ ప్లే స్టోర్ లో నేరుగా కెవికె అగ్రిటెక్–ఎటిపి (KVK AgriTech-ATP) అని టైప్ చేసి KVK, Reddipalli, ANGRAU అని ఉన్న యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని, వారి పేరు, గ్రామం, మండలం, జిల్లా, ఫోన్ నెంబర్ వంటి వివరాలతో రిజిస్టర్ చేసుకొని నిరంతరాయంగా పైన తెలిపిన సదుపాయాలను రైతులు అందరూ ఉచితంగా వినియోగించుకోవచ్చు.

యాప్‌ను రూపొందించిన శాస్త్రవేత్త (విస్తరణ) డా. ఎం. రవికిషోర్‌ను సంప్రతించడానికి మెయిల్ ఐ డి: mravikishore26@gmail.com

ఫోన్ నంబర్: 7799678807.

■

నీరే కదా అని వృధా చేస్తే రాబోయే రోజులలో మనకు మిగిలేది కన్నీరే

# మహిళలకు వ్యాపార ప్రారంభం, నిర్వహణలో శిక్షణ !

**అ**ట్టడుగు మహిళలకు సూక్ష్మ వ్యాపార అవకాశాలను ఒక జీవనోపాధి మార్గంగా అందించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తిరుపతికి చెందిన 'శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం' డబ్ల్యు ఇ పి పేరిట



ఒక మిని ఎం బి ఏ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

**శిక్షణ లక్ష్యాలు**

కొత్తగా వ్యాపార రంగంలో రాణించాలనుకొనే మహిళలు తమ సొంతంగా రూ. 20 లక్షల వరకు ఆదాయం పొందగలిగే వ్యాపార సంస్థలను నెలకొల్పడానికి కావాల్సిన వ్యవస్థాపక నైపుణ్యాలు అందించడం.

ప్రస్తుతం కొద్దిపాటి ఆదాయంతో వ్యాపారం నిర్వహిస్తున్న మహిళలు తమ వ్యాపారాన్ని ప్రస్తుత స్థాయి నుండి రూ. 40 లక్షల సంవత్సర ఆదాయం పొందే స్థాయికి అభివృద్ధి చేయడానికి కావాల్సిన నైపుణ్యాలు అందించడం.

ఉద్యోగాలు చేయదలచుకున్న మహిళలు వ్యాపార సంస్థలలో తగిన పదవులు పొంది నెలకు రూ.10,000 పైబడి సంపాదించుకునేందుకు కావలిసిన నాయకత్వ, నిర్వహణ నైపుణ్యాలను అందించడం.

**శిక్షణ పొందడానికి అర్హతలు**

25-45 సంవత్సరాల వయస్సు కలిగి, వ్యాపారాలు చేస్తున్న లేదా సొంత వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటున్న వారు, ఎస్‌హెచ్‌జిలు, సహకార సంఘాలు లేదా ఫెడరేషన్లలోని నాయకురాళ్ళు.

**విద్యార్హత :** 8వ తరగతి నుండి డిగ్రీ వరకు చదివినవారు. స్థానిక భాషలో చదవడం, రాయడం వచ్చి, ప్రాధమిక గణితం (కూడికలు, తీసివేతలు, భాగాహారం, వడ్డీ లెక్కలు) తెలిసినవారు, వ్యాపార నిర్వహణపై ఆసక్తి వున్నవారు.

ఈ శిక్షణ పొందడానికి తమ పేరును నమోదు చేసుకోవాలనుకునే వారు తమ పూర్తి పేరు, వయసు, చిరునామా, ఫోన్ నంబర్, ఏదైనా ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తుంటే ఉద్యోగం చేసే సంస్థ పేరు, లేదా నిర్వహించే వ్యాపార సంస్థ పేరు తెలియజేస్తూ ....

శ్రీ వేంకట సురేష్, ప్రోగ్రామ్ మేనేజర్‌కు 6305162719 ఫోన్ నంబర్‌కు వాట్సప్ లేదా ఎస్ ఎం ఎస్ సందేశం పంపాలి.



లిఖిత దరఖాస్తులను పంపదలచుకుంటే శ్రీ వేంకట సురేష్, ప్రోగ్రామ్ మేనేజర్, మొబైల్ నంబర్: 6305162719 ; శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం, అక్కారంపల్లి, మంగళం రోడ్, తిరుపతి- అనే చిరునామాకు పంపవచ్చు. ■

# తెలంగాణాలో వరి పంటకు ఎసరు !

కేంద్ర ప్రభుత్వం ఒక్క కిలో ఉప్పుడు బియ్యం కూడా కొనలేమని తేల్చి చెప్పినందున రాష్ట్రంలోని బాయిల్డ్ రైస్ మిల్లులు మూతపడే ప్రమాదం ఉందని.. రైతులు ఇకముందు వరి పంట సాగు చేయడం శ్రేయస్కరం కాదని తెలంగాణా వ్యవసాయశాఖ ఉన్నత స్థాయి సమీక్షలో అభిప్రాయం వ్యక్తమైంది. కేంద్ర ప్రభుత్వం తెగేసి చెప్పిన దరిమిలా, ఇక వచ్చే యాసంగి నుంచి వరి వేయడమంటే, రైతులు ఉరి వేసుకోవడమేనని సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఇటీవల జరిగిన సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలైన శనగలు, వేరుసెనగలు, పెసర్లు, మినుములు, నువ్వులు, ఆవాలు, పొద్దు తిరుగుడు, ఆముదాలు, కూరగాయల లాంటివి పండిస్తే రైతులకు లాభాలు వస్తాయని సమా వేశం అభిప్రాయపడింది.



ప్రస్తుత వానాకాలంలో 60 లక్షల టన్నులకు మించి ధాన్యం తీసుకోబోమని కేంద్రం నిర్మొహమాటంగా చెప్పినందున, ధాన్యాన్ని ప్రభుత్వంగానీ, మిల్లర్లుగానీ కొనుగోలు చేయడానికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు రానున్నాయని తెలిపింది.

ఈ సందర్భంగా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు మాట్లాడారు. "తెలంగాణలో గత యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా త్వరగా తీసుకుంటే వానాకాలంలో ఉత్పత్తయ్యే పంట నిల్వకు సరిపడా స్థలం లభిస్తుందని పేర్కొంటూ, ఇటీవల రాష్ట్ర మంత్రులు గంగుల కమలాకర్, కేటీఆర్‌లు కేంద్ర పౌరసరఫరాలశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలసి విన్నవించారు. ఇప్పటికే కేంద్రం వద్ద అయిదేళ్లకు సరిపడా నిల్వలున్నాయని, కొత్తగా కిలో కూడా కొనలేమని ఆయన తేల్చి చెప్పారు. దేశంలో కరవు, ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని ప్రజావసరాల దృష్ట్యా ధాన్యం నిల్వ చేయడం కేంద్ర ప్రభుత్వ విధి, రాష్ట్రాలు తమకు పంటలను కనీస మద్దతు ధర ద్వారా కొనుగోలు చేసి ఇవ్వడం వరకే రాష్ట్రాల బాధ్యత. కేంద్ర మంత్రి గోయల్ మాత్రం ఇప్పటికే నిల్వలు ఉన్న దృష్ట్యా కొత్తగా కొనేది లేదంటున్నారు" అని వారు పేర్కొన్నారు.

**ఇకపై కష్టమే**

"గత యాసంగిలో రాష్ట్రం 92 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. రైతులు ఈ వానాకాలంలో 55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. దీని ద్వారా సుమారు 1.40 కోట్ల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికే సుమారు 70 లక్షల టన్నుల ధాన్యం ఇంకా రాష్ట్ర రైస్‌మిల్లుల్లో, ఇతర ప్రదేశాల్లో నిల్వ ఉంది. వీటి దృష్ట్యా పీడీఎస్ తదితర అవసరాల మేరకు, కేంద్రం నిర్ధారించిన కోటా మినహా, మిగతా ధాన్యాన్ని కొనుగోలు చేయడం కేంద్ర ప్రభుత్వ విధానాల దృష్ట్యా సాధ్యం కాకపోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వంపై గత యాసంగిలో సేకరించిన ధాన్యం వల్ల సుమారు రూ.2,000 కోట్ల అదనపు భారం పడనుంది. కరోనా వల్ల రైతులు నష్టపోరాదని గతంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యయ ప్రయాసలకోర్చి పూర్తి ధాన్యం కొనుగోలు చేసింది. కానీ, ఈ వర్షాకాలంలో కేంద్రం నిర్ధారించిన 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లను ఐకేపీ కేంద్రాల ద్వారా కోటా మేరకు మాత్రమే ధాన్యం సేకరణ జరగాలి. రైతులను చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ అన్ని స్థాయిల్లోని అధికారులు తగు ప్రచారం నిర్వహించాలి'' అని సమావేశం అభిప్రాయపడింది. ■

చెరువు మనది, దానిని బాగుచేసుకుంటే బతుకు మనది

# న్యాయవ్యవస్థలోనూ మహిళలకు సగభాగం!

**న్యా**య వ్యవస్థలో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. న్యాయస్థానాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ లక్ష్యాన్ని చేరుకునేందుకు సమయం ఆసన్నమైందని చెప్పారు. తమకు 50 శాతం రిజర్వేషన్ కావాలని స్త్రీలు నినదించాలని సూచించారు. ఈ రిజర్వేషన్ ఎవరో ఇచ్చే దానం కాదని, అది వారి హక్కు అని తెలిపారు. ఈ విషయంలో తాను పూర్తి అండగా ఉంటానన్నారు. సుప్రీం కోర్టులో మహిళా న్యాయవాదులు ఇటీవల జస్టిస్ రమణకు, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులకు సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దిగువ కోర్టుల్లో మహిళలు 30 శాతమే ఉన్నారని, హైకోర్టుల్లో కేవలం 11 శాతం ఉన్నారని తెలిపారు. సుప్రీంకోర్టులోని 33 మంది న్యాయమూర్తుల్లో ఇప్పుడు నలుగురు మహిళలు వచ్చారన్నారు. కొలీజియంలో ప్రగతిశీల సహచరులు ఉండడం తనకెంతో సంతోషకరమని, వారి సహాయంతో ఉన్నత న్యాయ వ్యవస్థలో వ్యత్యాసాన్ని పూరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. దేశంలోని మొత్తం 1.70 లక్షల మంది న్యాయవాదుల్లో కేవలం 15 శాతమే మహిళలని, రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో 2 శాతం మహిళలే ఎన్నికవుతున్నారని పేర్కొన్నారు. న్యాయ కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలన్న ప్రతిపాదనను తాను సమర్థిస్తానని జస్టిస్ రమణ చెప్పారు. కక్షిదారుల ప్రాధాన్యాలు, అసౌకర్యమైన వాతావారణం, మౌలిక సదుపాయాల లేమి వంటివి న్యాయ వృత్తిలో మహిళలకు ఇబ్బందులు కలగజేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. దేశంలో 60 వేల న్యాయస్థానాలు ఉండగా వాటిలో 22 శాతం కోర్టుల్లో మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కూడా లేవని చెప్పారు. మహిళా అధికారులు కూడా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సౌకర్యాల లేమి, పాతబడిన, శిథిల భవనాల్లో న్యాయం అందించాల్సి రావడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉందన్నారు. అందుకే తాను జ్యుడీషియల్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించానని చెప్పారు.

**మహిళల పాత్ర పెరిగితేనే న్యాయపూర్వక సమాజం**

సుప్రీంకోర్టులో ముగ్గురు మహిళలు సహా ఒకేసారి 9 మంది న్యాయమూర్తుల నియామకం న్యాయ వ్యవస్థలోనే చరిత్రాత్మక సందర్భమని రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్ ప్రశంసించారు. సుప్రీంకోర్టు చరిత్రలో ఒకేసారి నలుగురు మహిళా న్యాయమూర్తులు ఉండటం కూడా ఇదే ప్రథమమని గుర్తు చేశారు. ఈ నియామకాలతో భవిష్యత్తులో సుప్రీంకోర్టులో మహిళా ప్రధాన న్యాయమూర్తి నియామకానికి మార్గం సుగమం అయ్యిందన్నారు. రాజ్యాంగ సమ్మిళిత ఆదర్శాలను సాధించడానికి న్యాయ వ్యవస్థలో మహిళల పాత్రను మరింత పెంచాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రపతి ప్రయాగరాజ్‌లో నూతన న్యాయ విశ్వ విద్యాలయ భవన నిర్మాణానికి, అలహాబాద్ హైకోర్టు నూతన భవన సముదాయ నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో కలిసి శంకుస్థాపన చేశారు. న్యాయ వ్యవస్థ సహా అన్ని రంగాల్లో మహిళల పాత్ర పెరిగినపుడే న్యాయపూర్వకమైన సమాజం ఏర్పాటు సాధ్యమవుతుందన్నారు.

**దసరా తర్వాత భౌతిక విచారణలు!**

న్యాయస్థానాల్లో భౌతిక విచారణ జరగాలన్న ప్రతిపాదనకు తాను మద్దతునిస్తానని జస్టిస్ రమణ చెప్పారు. కోర్టులను తెరిచేందుకు సమస్యేమీ లేదని, వైద్యశాఖ సూచనలను మీరి రిస్క్ చేయడం మంచిది కాదని పేర్కొన్నారు.కొవిడ్ సంక్షోభం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని తాను కూడా భావిస్తానని చెప్పారు. దసరా సెలవుల తర్వాత కోర్టులు భౌతికంగా విచారణ జరిపే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ■

# వానాకాలం ఈ కూరగాయలకు ప్రతికూలం !

**దం**చి కొడుతున్న వానలతో చల్లబడిన వాతావరణం ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు, కొన్ని రుతుపరమైన ఇబ్బందులనూ తెచ్చి పెడుతూ ఉంటుంది. కాబట్టి వాటి మీద ఓ కన్నేసి ఉంచి, మెలకువగా వ్యవహరిస్తూ ఉండాలి. రుతువుల పరంగా వేర్వేరు కాలాల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. వానా కాలంలో వాత, పిత్త దోషాలు కలిగిన వారికి వివిధ రకాల రుగ్మతలు తిరగబెడుతూ ఉంటాయి. అవేంటంటే..

వాత: వేసవి ఫలితంగా భూమిలో బిగదీసుకుపోయిన వాయువులు, ఆమ్ల సహిత వాతావరణం మూలంగా, వాతం పెరిగి, వానాకాలంలో జీర్ణశక్తి సన్నగిల్లుతుంది.

పిత్త: వానాకాలంలో క్షీణించిన జీర్ణశక్తి మూలంగా వేసవిలో వేడి పెరగడంతో పాటు, పిత్తం కూడా పెరుగుతుంది. వానాకాలం చల్లని వాతావరణం చెలరేగిన వెంటనే లక్షణాలు ఇబ్బంది పెట్టడం మొదలుపెడతాయి.

**ఆయుర్వేద చికిత్సలతో...**

వర్ష రుతువులో వాతం పెరగడం, పిత్తం పేరుకుపోవడం మూలంగా ఈ కాలంలో కొన్ని రకాల సమస్యలు విపరీతంగా వేధిస్తాయి. కాబట్టి వాతం, పిత్తాలను సమతుల్యం చేసే ఆహారపుటలవాట్లు, జీవనశైలి మార్పులను స్వాగతించాలి. లేదంటే వర్ష రుతువులో వేధించే టైఫాయిడ్, కలరా, కామెర్లు, జలుబు, దగ్గు మొదలైన ఇబ్బందులు తప్పవు. ఈ రుగ్మతలు దరి చేరకుండా ఉండాలంటే అభ్యంగనం లేదా నూనెతో మర్దన, స్వేదనం, బస్తి చికిత్సలను క్రమం తప్పక అనుసరించాలి.



**అభ్యంగనం**

వర్షాకాలంలో పెరిగే కీళ్ల నొప్పులు, ఎముకల నొప్పుల నుంచి విముక్తి పొందడానికి అభ్యంగనం ఆచరించాలి. వర్షాకాలంలో వన్నె తగ్గి, నిర్జీవంగా తయారయ్యే చర్మానికి కూడా ఈ చికిత్స ఎంతో మేలు చేస్తుంది. చర్మానికి తేమ, మెరుపులను ఇవ్వడంతో పాటు ఎముకలు బలపడేలా చేస్తుంది అభ్యంగనం. నూనెతో మర్దన తర్వాత తీసుకునే ఆవిరి స్నానం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుని విషతుల్య వ్యర్థాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా వాపులు, నొప్పులు తగ్గడంతో పాటు బిగుసుకుపోయిన కీళు వదులవుతాయి.

**స్వేదనం**

దీన్లో రెండు రకాల చికిత్సలు ఉంటాయి. ఔషధ మొక్కల ఆకులను ఉడికించి ఉపయోగించే 'పత్ర స్వేదనం' చికిత్స వల్ల ఆర్థ్రయిటిస్ నొప్పులతో పాటు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వెన్ను సంబంధ స్పాండిలోసిస్ సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి. రుక్ష స్వేదనం అనే ఉష్ణ చికిత్స వల్ల రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ నొప్పులు తగ్గుముఖం పడతాయి.

**బస్తి (ఎనీమా)**

ఈ చికిత్సలో వాడే నూనెలు, ఇతర కషాయాలు వాత దోషాన్ని హరిస్తాయి. వాత దోషం మూలంగా శరీరంలో చేరుకున్న మలినాలు నూనె లేదా కషాయ ఎనీమాల వల్ల బయటకు వెళ్లిపోతాయి.

**జలుబు, దగ్గులకు ఆయుర్వేద చికిత్స!**

వర్షాకాలం జలుబు, దగ్గు అత్యంత సహజం. ఈ రుగ్మతలను తేలికగా వదిలించుకోవాలంటే....

కొన్ని చుక్కల నిమ్మరసం, చిటికెడు దాల్చినచెక్క పొడి, అర చెంచా తేనెలను కలిపి రోజూ రెండు పూటలా తీసుకోవాలి.

రోజంతా గోరువెచ్చని నీళ్లు తాగుతూ ఉండాలి. వేడినీళ్లు జలుబు, దగ్గు, గొంతు నొప్పులకు కారణమయ్యే వైరస్‌లతో పోరాడే శక్తినిస్తాయి. అలాగే శరీరంలోని ఇన్‌ఫెక్షన్లను బయటకు తోలి, శరీరానికి సరిపడా హైడ్రేషన్‌ను అందిస్తాయి.

రోజుకొక ఉసిరి కాయ తింటూ ఉన్నా కాలేయం ఆరోగ్యం భేషుగ్గా ఉండి, రక్త ప్రసరణ మెరుగై వ్యాధికారక క్రిముల నుంచి రక్షణ పొందగలుగుతాం!

అవిసె గింజలను నీళ్లలో చిక్కబడేవరకూ ఉడికించి, వడకట్టాలి. ఈ కషాయంలో నిమ్మరసం, తేనెలను కలిపి తీసుకున్నా జలుబు, దగ్గులు తగ్గుతాయి.

నల్లమిరియాలు, బెల్లం, జీలకర్ర నీళ్లలో మరిగించి, తీసుకున్నా జలుబు, దగ్గు వల్ల పట్టేసిన ఛాతీ వదులై ఊపిరిఅందుతుంది.

క్యారట్ రసం తాగడం వల్ల జలుబు దరి చేరకపోగా, వచ్చిన జలుబు కూడా త్వరగా తగ్గిపోతుంది.

**ఆయుర్వేద చికిత్సలతో జ్వరాలు బలాదూర్!**

ఆయుర్వేదం జ్వరాలను రెండు రూపాల్లో అంచనా వేస్తుంది. జ్వరాన్ని జ్వరంగానూ లేదా ఇతర రుగ్మతల లక్షణంగానూ పరిగణించి, తదనుగుణ చికిత్స అందిస్తే రుగ్మత అదుపులోకి వస్తుంది. రుతువును బట్టి ఆ కాలంలో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో వేర్వేరు పేర్లు ఉన్నాయి. వర్ష రుతువులో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో 'వతజ జ్వరం' అని పేరు. ఈ జ్వరాలకు ఆయుర్వేదంలో చక్కని చిట్కాలు ఉన్నాయి.

గ్లాసుడు నీళ్లలో చిటికెడు దాల్చినచెక్క పొడి, చిటికెడు మిరియాలపొడి కలిపి వేడి చేసి, నిమ్మరసం కలుపుకుని తాగితే జ్వరంతోపాటు, గొంతు నొప్పి కూడా తగ్గుతుంది.

**జీలకర్ర అద్భుతమైన యాంటీసెప్టిక్!**

జీలకర్ర పొడి కలిపి మరిగించిన నీటిలో తేనె కలుపుకుని తాగితే వర్షాకాల సంబంధ జ్వరాలు తగ్గుముఖం



పడతాయి. జ్వరంతో పాటు విపరీతమైన జలుబు, దగ్గు కూడా ఉంటే గోరువెచ్చని తేనెలో పావు చెంచా దాల్చిన చెక్క పొడి కలిపి రోజుకు మూడుసార్లు తీసుకోవాలి.

**డెంగ్యు జ్వర చికిత్స!**

ఆయుర్వేదంలో ఈ జ్వరాన్ని 'దండక జ్వరం' అంటారు. ఈ జ్వరం వేధిస్తున్నప్పుడు తేలికగా అరిగే గంజి ఆహారంగా ఇవ్వాలి. తులసి, యాలకులు వేసి కాచిన కషాయాన్ని ఇవ్వాలి. కారాలు, నూనెలు తగ్గించి వండిన ఆహారం ఇవ్వాలి. పునర్నవ మూలికతో తయారైన కషాయంతో డెంగ్యు జ్వరం అదుపులోకి వస్తుంది. అలాగే వ్యాధి నిరోధకశక్తిని పెంచడం ద్వారా పరోక్షంగా ఈ జ్వరం తగ్గేలా చేయవచ్చు. కాబట్టి రోగనిరోధ శక్తిని పెంచే తులసి నీళ్లను రోజంతా తాగించాలి. అలాగే రోజు మొత్తంలో 10 నుంచి 15 తులసి ఆకులు నమిలించాలి. డెంగ్యు జ్వరాన్ని తగ్గించే 'ధతుర' మూలికను ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. మెంతి ఆకులతో తయారుచేసిన తేనీరు తాగుతూ, ద్రాక్ష, దానిమ్మ రసాలు తీసుకున్నా డెంగ్యు జ్వరం తగ్గుముఖం పడుతుంది.

**ఛాతీలో ఇబ్బందికి 'దీర్ఘ ప్రాణాయామం'!**

వర్షాకాలం చల్లని వాతావరణం మూలంగా ఛాతీలో కఫం పేరుకుపోయి ఊపిరి ఇబ్బందవుతుంది. శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. ఈ ఇబ్బందులు తొలగాలంటే 'దీర్ఘ ప్రాణాయామం' సాధన చేయాలి. ఇందుకోసం నేల మీద నిటారుగా కూర్చుని, గాలి పీల్చుకోవాలి. ఈ గాలి ఛాతీ పై ప్రదేశాన్ని, తర్వాత పొట్టనూ నింపాలి. తిరిగి గాలిని బయటకు వదిలే తీరు వ్యతిరేక క్రమంలో సాగాలి. ఇలా మూడు నిమిషాలపాటు రోజులో కనీసం నాలుగు సార్లు సాధన చేయాలి. ఇలా చేస్తే ఛాతీ, ఊపిరితిత్తుల్లో రక్తప్రసరణ పెరిగి కఫం వదులై బయటకు వస్తుంది.

**వర్ష రుతువు ఆహారం!**

ఎర్ర బియ్యం, గోధుమలు, జొన్నలు ఈ కాలంలో శ్రేష్ఠం.

**కషాయాలతో వర్ష రుతువు రుగ్మతలు దూరం!**

మూలికలు, పత్రాలు, సుగంధ ద్రవ్యాలతో తయారయ్యే కషాయాలు వర్ష రుతువు వేధించే పలు రుగ్మతలకు దివ్యౌషధంలా పని చేస్తాయి. అవేంటంటే...

**రోగనిరోధకశక్తి:** ఈ రుతువులో సన్నగిల్లే వ్యాధి నిరోధకశక్తిని మెరుగు పరుచుకోవడం కోసం యాలకులు, దాల్చినచెక్క, తెల్ల మిరియాలు వేసిన నీటిని మరిగించి తాగాలి. రుచి సహించకపోతే కొద్దిగా తేనె కలుపుకోవచ్చు. ఈ కషాయం ప్రతి రోజూ తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి మెరుగ్గా ఉండి, వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి.

**అజీర్తి:** వానాకాలం తగ్గే అజీర్తిని సరిచేయడం కోసం నీటిలో వాము, సోంపు వేసి మరిగించి, తేనె కలిపి తీసుకోవాలి. భోజనం చేసిన ప్రతిసారీ ఈ కషాయం తాగుతూ ఉంటే, అజీర్తి సమస్య తలెత్తదు.





సొరకాయ, పొట్లకాయ, దొండకాయ ఎక్కువగా తినాలి. పప్పుల్లో కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు ఎక్కువగా తీసుకోవాలి. ఖర్జూరం, ద్రాక్ష, కొబ్బరి తింటూ ఉండాలి.

ఆవు పాలు, మజ్జిగ, నెయ్యి క్రమం తప్పక తీసుకోవాలి.

ధనియాలు, జీలకర్ర, బెల్లం, పుదీనా, ఇంగువ, మిరియాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

**ఇవి తగ్గించాలి!**

రాగులు, బార్లీ తీసుకోకూడదు.

పాలకూర, కాకరకాయ, క్యాబేజీ తగ్గించాలి.

బఠాణీ, సెనగపప్పు తినకూడదు.

బంగాళాదుంప, సగ్గుబియ్యం, క్యారెట్ తగ్గించాలి.

తీపి వంటకాలు, పన్నీర్, శ్రీఖండ్‌లకు దూరంగా ఉండాలి.

**సాధారణ జ్వరం:** ఏడు తులసి ఆకులు, ఐదు లవంగాలు తీసుకుని దంచాలి. వీటిని మరిగించిన నీటిలో కలిపి, కొద్దిగా సముద్రపు ఉప్పు చేర్చి, రెండు రోజులపాటు రోజుకు రెండుసార్లు తాగాలి. ఇలా చేస్తే వర్ష రుతు సంబంధ సాధారణ జ్వరాలు తగ్గుతాయి.

**తేలికైన ఆరోగ్య చికిత్సలు!**

నీటి సంబంధ రుగ్మతలు దరి చేరకుండా వేడి చేసిన నీరే తాగాలి.

వానాకాలంలో అత్యంత సాధారణమైన గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడం కోసం గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి.

తులసి నీళ్లలో పసుపు కలిపి, కషాయం తయారు చేసుకుని నోరు పుక్కిలిస్తున్నా గొంతు నొప్పి తగ్గుతుంది. ■

# ఈ మహిళా ఉద్యోగికి 1.8 కోట్ల పరిహారం !

ఉద్యోగులకూ కొన్ని హక్కులు ఉంటాయి. వాటిని యాజమాన్యాలు విధిగా గౌరవించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో సెలవుల మంజూరు చేయడం, మహిళలకు సౌకర్యంగా ఉండేలా పనివేళలు నిర్ణయించడం వంటి అంశాల విషయంలో సంస్థలు ఎటువంటి వివక్షకూ తావివ్వకూడదు. ఓ మహిళా ఉద్యోగి పట్ల వివక్ష ప్రదర్శించిన రియల్ ఎస్టేట్ సంస్థకు తాజాగా దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఆమెకు జరిగిన నష్టానికి పరిహారంగా సదరు సంస్థ భారీగా పరిహారం చెల్లించుకోవాల్సి వచ్చింది. కేసు పూర్వాపరాల్లోకి వెళితే..

బ్రిటన్‌కు చెందిన ఆలిస్ థామ్సన్.. మేఫెయిర్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీలో సేల్స్ మేనేజర్‌గా పని చేసేవారు. ఆమె ఆదాయం 1.20 లక్షల పౌండ్లు. ప్రతిరోజు ఆమె సాయంత్రం 6 గంటల వరకూ ఆఫీసులోనే ఉండాల్సి వచ్చేది. కాగా.. 2018 లో ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ క్రమంలో ఆమె తన బిడ్డను క్రచ్‌లో చేర్పించారు. అయితే.. సాయంత్రం ఆరు వరకూ ఆఫీసులోనే ఉండాల్సి రావడంతో.. క్రచ్ నుంచి పాపను తీసుకురావడం ఆలిస్‌కు ఇబ్బందిగా మారింది.

దీంతో..ఆమె కంపెనీ డైరెక్టర్ అయిన పాల్ సెల్లర్‌ను సంప్రదించారు. తనకు సౌలభ్యంగా ఉండేలా పనివేళల్లో మార్పులు చేయాలని కోరారు. వీలైతే పార్ట్‌టైంగా ఉద్యోగం చేసేందుకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే.. పాల్ దీన్ని నిరాకరించారు. ఆలిస్ అభ్యర్థనను అంగీకరించాలంటే.. వ్యవస్థలో పలు మార్పులు చేయాల్సి వస్తుందని, ఇది ఆర్థికంగా తమకు భారమవుతుందని పాల్ పేర్కొన్నారు.

ఆలిస్.. అప్పటికే సంస్థలో తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నారు. కింది స్థాయిలో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆమె అంచెలంచెలుగా ఎదుగుతూ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. సంస్థతో ఇంత సుదీర్ఘ అనుబంధం ఉన్న తన అభ్యర్థనను పాల్ తిరస్కరించడం ఆలిస్‌ను మానసికంగా గాయపరిచింది. ఓ తల్లిగా తన బాధ్యతను నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తున్న తనపై సంస్థ వివక్ష చూపిస్తోందని ఆలిస్ భావించారు. దీంతో.. ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆమె న్యాయపోరాటం ప్రారంభించారు. స్త్రీ అయిన కారణంగానే తాను సంస్థలో వివక్ష ఎదుర్కోవాల్సి వచ్చిందంటూ ఆలిస్ ఉద్యోగుల ట్రిబ్యునల్‌లో కేసు వేశారు.

2019లో ఉద్యోగానికి రిజైన్ చేసిన అనంతరం ఆలిస్.. ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా తాజాగా ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువడింది. సదరు కంపెనీ తన చర్యల ద్వారా ఆలిస్‌పై పరోక్షంగా వివక్ష ప్రదర్శించిందని పేర్కొన్న ట్రిబ్యునల్.. ఆమెకు 1.85 లక్షల పౌండ్లు (మన కరెన్సీలో 1.8 కోట్లు) పరిహారం చెల్లించాలంటూ తాజాగా తీర్పు వెలువరించింది. జీతభత్యాలు, పెన్షన్ రూపంలో ఇంతకాలంగా ఆలిస్ నష్టపోయిన సొమ్మును ఆమెకు తిరిగి చెల్లించాలని తీర్పిచ్చింది.

**లైంగికవేధింపులను తగ్గించిన కరోనా !**

కరోనా వైరస్ మహమ్మారితో మహిళా ఉద్యోగినులు వర్క్ ఫ్రం హోం వల్ల గత ఆర్థిక సంవత్సరంలో కార్యాలయాల్లో మహిళలపై లైంగికవేధింపుల కేసులు తగ్గాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 44 నిఫ్టీ కంపెనీల్లోని పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపుల ఫిర్యాదుల సంఖ్య 38.26 శాతానికి పడిపోయింది.

కరోనా వైరస్ వ్యాప్తి వల్ల లాక్ డౌన్‌లు, రిమోట్, వర్క్ ఫ్రం హోం, హైబ్రిడ్ వర్క్ మోడళ్లకు మారడంతో పలు కంపెనీల్లో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల కేసులు బాగా తగ్గాయని లైంగిక వేధింపుల సలహా డాట్ కాం డేటాలో వెల్లడైంది.

ఈ ఏడాది మార్చి 31 తో ముగిసిన ఆర్థిక సంవత్సరం లో 455లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చాయి. 2019 లో 739 లైంగిక వేధింపుల ఫిర్యాదులు నమోదయ్యాయి.

# ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల వలస!

**ఢి**ల్లీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడంపై ఆప్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడేలా వాటిని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీర్చిదిద్దారు. కేజ్రీ ప్రయత్నాలు ఫలించి ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా తయారయ్యాయి.

దీంతో ప్రైవేట్ స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. గత కొన్ని సంవత్సరాలలో ప్రైవేట్ స్కూళ్లలో చదువుకుంటున్న 2 లక్షల మందికి పైగా విద్యార్థులు అక్కడి నుంచి వచ్చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ విషయంపై 'న్యూస్ నేషన్' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోందని న్యూస్ నేషన్ తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచే కార్యక్రమాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని కితాబు నిచ్చింది. విద్యా వ్యవస్థలో కేజ్రీవాల్ అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పారని చెప్పింది.

ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అంతర్జాతీయ సంస్థతో ఢిల్లీ ప్రభుత్వం



ఒప్పందం చేసుకుందని పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యంత నాణ్యమైన విద్యను పొందేందుకు ఈ ఒప్పందం దోహదం చేసిందని చెప్పింది. అందువల్లే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని తెలిపింది.

విద్యా వ్యవస్థలో కేజ్రీవాల్ ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందని పేర్కొంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దేశభక్తి పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని ఇటీవల నిర్ణయం తీసుకుందని చెప్పింది. విద్యార్థుల్లో దేశభక్తిని, మాతృభూమిపై ప్రేమను, గౌరవాన్ని పెంపొందించేలా కార్యాచరణను రూపొందించిందని తెలిపింది. సీబీఎస్ఈ తరహాలో సొంతంగా ఢిల్లీ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ను ఏర్పాటు చేసిందని చెప్పింది. ఈ బోర్డు ఏర్పాటు వల్ల ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందుతున్నారని ప్రశంసించింది.

ఈ కథనాన్ని కేజ్రీవాల్ ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. రెండు లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారనే దానిపై స్పందనగా... దేశ చరిత్రలో తొలిసారి ఇది జరుగుతోందని అన్నారు. ■

---

2020 లోనూ 737 ఫిర్యాదులు వచ్చాయి. అదానీ పోర్ట్స్, స్పెషల్ ఎకనామిక్ జోన్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోల్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్, యుపిఎల్, శ్రీ సిమెంట్ కంపెనీల్లో గత ఆరేళ్లుగా మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపుల కేసులు నివేదించలేదు.

గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్యాల కంటే ప్రైవేట్ సంస్థలు పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల సంఘటనలను ఎక్కువగా నివేదించాయని డేటా చూపించింది. హెచ్డీఎఫ్‌సీ బ్యాంకులో 2020-2021 లో 47 లైంగిక ఫిర్యాదులు వచ్చాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 45 కేసులు నమోదయ్యాయి. గతంతో పోలిస్తే విప్రోలో ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయి. యాక్సిస్ బ్యాంక్‌లో 39 ఫిర్యాదులు, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ లో 39, ఐసిఐసిఐ బ్యాంక్ లో 33, టెక్ మహీంద్రాలో 30 కేసులు నమోదయ్యాయి. ■

# కూరగాయల సాగులో జీవన ఎరువులు

– కె.భవ్యశ్రీ , అసిస్టెంట్ ప్రొఫెసర్ అగ్రికల్చర్ కాలేజీ, సిరిసిల్ల

**కూ**రగాయల సాగులో జీవన ఎరువులు వాడడం ద్వారా 20 నుంచి 25 శాతం దాకా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. నేల, వాతావరణం నుంచి నత్రజని, భాస్వరాన్ని గ్రహించి మొక్కలకు అందు బాటులోకి వస్తాయి. పంటపై సస్యరక్షణ ఖర్చులు తగ్గించవచ్చు. పంట నాణ్యత, దిగుబడులు 10 నుంచి 20 శాతం పెరుగుతాయి. జీవన ఎరువుల వాడకం వల్ల వేర్లు సమృద్ధిగా పెరిగి తద్వారా మొక్కలకు నీరు పీల్చుకునే సమర్థ్యం పెరగడంతో, మొక్కలకు నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి పెరుగుతుంది. భూమిలోని వ్యాధికారక సూక్ష్మజీవులను నశింపచేసి మొక్కలకు రక్షణ కల్పిస్తాయి. మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మొక్కలకు పోషకాలను విరివిగా అందించేటట్టు చేయడమే కాక నేలలో పోషక పదార్థాలను స్థిరీకరించి భూసారాన్ని పెంచుతాయి. పంటలకు వాడే పద్ధతి సులభంగా ఉంటుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. జీవన ఎరువులు మోతాదుకు మించి వాడినా, పంటకుగానీ, నేలకు గానీ, వాతావరణానికా గానీ ఎలాంటి నష్టం ఉండదు.



**జీవన ఎరువుల రకాలు**

వాతావరణంలో సుమారు 78శాతం నత్రజని ఆవరించి ఉంది. ఈ నత్రజనిని పంటలకు ఉపయోగపడే విధంగా మార్పు చేయడమే జీవన ఎరువుల వినియోగంలో పరమార్థం. ప్రస్తుతం మనకు రెండు రకాల జీవన ఎరువులు వాడకంలో ఉన్నాయి.

1. మొక్కలకు నత్రజని అందించే సూక్ష్మజీవులైన నైట్రో బ్యాక్టీరియా
2. భాస్వరాన్ని అందించే జీవరాసులు.

**రైజోబియం :**

ఈ బ్యాక్టీరియాను ముఖ్యంగా బఠాణి,చిక్కుడు, ఫ్రెంచి చిక్కుడు వంటి కూరగాయలకు వాడతారు. కానీ కూరగాయల వేర్లలో బుడిపెలుగా ఏర్పడి వాటిలో సహజీవనం చేస్తూ, గాలిలోని నత్రజనిని మొక్కకు అందుబాటులో ఉండేలా చేస్తాయి. దీనితో పాటు 16 నుంచి 32 కిలోల నత్రజనిని భూమిలో నిల్వచేసి, ఆ తర్వాత మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

**వాడే విధానం :**

ఒక లీటరు నీటిలో 50గ్రా. బెల్లం లేదా చక్కెరను కరిగించి15 నిమిషాలపాటు వేడిచేసి చల్లార్చాలి. ఆ ద్రావణానికి 20 గ్రా. 'రైజోబియం కల్చర్' కలిపి విత్తనానికి పట్టించి ఆరబెట్టి విత్తాలి.

**అజటోబాక్టర్ :**

ఇవి స్వతంత్రంగా జీవించే సూక్ష్మజీవులు. ఇవి మొక్కలపై ఆధారపడకుండా స్వతంత్రంగా నేలలో నివసిస్తూ గాలి నుండి నత్రజనని స్వీకరించి మొక్కలకు అందజేస్తాయి. కూరగాయల పంటలలో పెరుగుదలకు కావాల్సిన హార్మోన్లు, విటమిన్లు ఉత్పత్తి చేస్తుంది. పంటలకు అజటోబాక్టర్ వాడడం వల్ల అధిక దిగుబడులు ఉదాహరణకు బెండ 83 శాతం, వంగ 89 శాతం, కాలిఫ్లవర్ 103 శాతం సాధించవచ్చని పరిశోధనా ఫలితాలు తెలుపుతున్నాయి.

**వాడే విధానం:**

నారు ద్వారా అయితే ఒక కిలో జీవన ఎరువును 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణం తయారు చేయాలి. ఒక ఎకరానికి సరిపడే నారును చిన్న చిన్న కట్టలుగా కట్టి ఈ మిశ్రమంలో 15నుంచి 20 నిమిషాలుంచి, ఆ తరువాత

మొక్కలు నాటాలి. నేల ద్వారా అయితే 2నుంచి 3 కిలోల అజటోబాక్టర్‌ను 40 నుంచి 60 కిలోల మట్టితో గానీ, లేక సేంద్రియ ఎరువులోగానీ కలిపి పంట విత్తే ముందు నేలలో తేమ ఉండే విధంగా చూసుకొని చల్లాలి. ఈ జీవన ఎరువు భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థవంతంగా ఉపయోగపడుతుంది.

**అజోస్పైరిల్లం:**

వీటిని సహవాసి సూక్ష్మజీవులు అని అంటారు. ఇవి వివిధ పంటల వేర్ల మీద లేదా వేర్ల దగ్గర జీవిస్తాయి. ఇవి గాలిలో నత్రజని తీసుకొని వేర్ల మీద స్థిరీకరించుకోగలవు. వేర్లదగ్గర అవసరమైన హార్మోన్లను విసర్జించడం వల్ల మొక్క చురుకుగా పెరుగుతుంది. ఇవి ఎకరానికి 8 నుంచి 16 కిలోల నత్రజనిని స్థిరీకరించగలవు. వీటిలో అజోస్పైరిల్లం, లిఫోఫెరమ్ రకాలు అనువైనవి.

ఈ రెండు రకాలను టమాట, వంగ, బెండతోపాటు ఇతర కూరగాయల పంటలకు వాడవచ్చు. ఈ జీవన ఎరువును వాడి ఎకరానికి 25 నుంచి 30 శాతం వరకు మనం వేసే నత్రజని ఆదా చేసుకోవచ్చు. ఈ కల్చర్‌ను కూడా అజటోబాక్టర్ వాడే పద్ధతిలోనే అదే మోతాదులో ఉపయోగించి, మంచి దిగుబడులు పొందవచ్చు. అజటో బాక్టర్ కన్నా ఎక్కువ నత్రజని స్వీకరించి తక్కువ సేంద్రియ పదార్థంగల నేలల్లో కూడా బాగా వృద్ధి చెందుతుంది.

**ఫాస్ఫోబ్యాక్టీరియా:**

వీటిని ఫాస్ఫరస్ సాల్యుబు లైజింగ్ మైక్రోఆర్గానిజమ్స్ అంటారు. వీటిలో బాసిల్లస్, సూడోమోనాస్ సూక్ష్మజీవులు, ఆస్పర్జిల్లస్, పెన్సిలియం శిలీంధ్రాలు ముఖ్యమైనవి. ఇవి వేసవిలో స్వతంత్రంగా జీవిస్తాయి. వీటి నుండి తయారయ్యే సేంద్రియ అమ్లాల వల్ల భూమిలో బిగుసుకుపోయి లభ్యం కాని స్థితిలో ఉన్న భాస్వరాన్ని ట్రైకాల్షియం ఫాస్ఫేట్ రూపంలో మొక్కలకు లభ్యమయ్యే రీతిలో మారుస్తాయి. మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తాయి. మొక్క వేర్ల దగ్గర వీటి చర్య చురుకుగా ఉండి జీవక్రియకు తోడ్పడతాయి. వీటి వాడకం వల్ల సిఫార్సు చేసిన మోతాదు నుంచి ఎకరానికి 10 నుంచి 12 కిలోల భాస్వర పోషకం తగ్గించవచ్చు. ఈ ఫాస్ఫోబ్యాక్టీరియాను అన్ని కూరగాయ పంటల్లో వాడుకోవచ్చు.

**వాడే విధానం:**

200 నుంచి 400 గ్రా ఫాస్ఫోబ్యాక్టీరియా ఎరువును ఎకరానికి సరిపడే విత్తనానికి పట్టించవచ్చు. 1నుంచి 2 కిలోల కల్చర్‌ను సుమారు 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేల దుక్కిలో వేసుకోవచ్చు.

**వెసిక్యూలర్అర్బస్కులర్ మైరోరైజా (వి.ఎ.ఎం.)**

ఈ శిలీంధ్రాన్ని మైరోరైజా అనే పేరుతో పిలుస్తారు. వీటిలో గోబస్ జిగాస్పోరా శిలీంధ్ర రకాలు ముఖ్యమైనవి. ఇవి వేరు మండలం మీద మొక్కలతో కలిసి జీవిస్తాయి. మైరోరైజా శిలీంద్రపు మూలాలు (హైఫేలు) వేర్లలో వాటిపై పొరలలోకి, లోపలి పొరలలోనికి కూడా చొచ్చుకొనిపోగలవు. ఇవి ఆహారానికి మొక్కలపై ఆధారపడతాయి. దీనికి బదులుగా ఇవి నేల నుండి భాస్వరాన్ని మొక్కలకు అందిస్తాయి. ఈ ప్రక్రియలో శిలీంద్రం కన్నా మొక్క అధిక లాభాన్ని పొందు తుంది. ఈ శిలీంద్రం భాస్వరాన్ని గ్రహించి, నిల్వ ఉంచి అవసరమైనప్పుడు మొక్కకు అందిస్తుంది. వేరు వ్యవస్థ చుట్టూ ఈ శిలీంద్రం ఒక రక్షణ కవచం వలే ఏర్పడి రోగకారకాలైన సూక్ష్మజీవుల ప్రవేశాన్ని నిరోధిస్తుంది. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి కూడా తోడ్పడుతుంది. ఈ కల్చరును కూడా ఫాస్ఫోబ్యాక్టీరియా వాడే పద్ధతిలోనే అదే మోతాదులో అన్ని కూరగాయల పంటల్లో వాడవచ్చు.

**వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**


- జీవన ఎరువు ప్యాకెట్లను ఎండ, వేడి తగలని చల్లని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి.
- రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులతో కలిపి వాడకూడదు.
- నిర్దేశించి కాలపరిమితిలోపు మాత్రమే వాడాలి.
- జీవన ఎరువులు వేసిన వెంటనే పంటక నీరు పెట్టాలి.
- ఇతర రసాయన ఎరువులకు దూరంగా ఉంచాలి.
- జీవన ఎరువులను దిబ్బ ఎరువు, కంపోస్టు ఎరువుతోగానీ కలిపి వాడితే మంచి దిగుబడులు వస్తాయి.

■

# రైతుబిడ్డకు నాలుగు బంగారు పతకాలు

## అంతర్జాతీయ పోటీలో గెల్చుకున్న యువ ఆవిష్కర్త అశోక్

**చి**న్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే చక్కని వ్యవసాయ పరికరాలను రూపొందించి శభాష్ అనిపించుకున్న యువకుడు గౌర్రె అశోక్‌కు 'ఇ-న్నోవేట్' ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ ఇన్నొవేషన్ షోలో ఇటీవల నాలుగు బంగారు పతకాలు దక్కాయి. పోలెండ్‌లోని జకపొనె నగరంలో ప్రతి ఏటా ఈ పోటీ జరుగుతుంది. ఈ ఏడాది పోటీకి ప్రపంచ దేశాల నుంచి 2వేలకు పైగా ఎంట్రీలొచ్చాయి. ఈ పోటీలో




రెండుకు మించి బంగారు పతకాలు గెల్చుకున్న ఇన్నోవేటర్ అశోక్ ఒక్కరే కావటం విశేషం. వ్యవసాయం, ఆక్వాకల్చర్ విభాగంలో 12 ఆవిష్కరణలకు బంగారు పతకాలు దక్కగా అందులో తొలి 4 అశోక్‌వి కావటం మరో విశేషం.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అంజలీపురంలో చిన్న రైతు కుటుంబంలో పుట్టిన అశోక్.. దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వ్యవసాయ వృత్తి విద్యా కోర్సు పూర్తి చేశారు. చిన్న, సన్నకారు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం ఆయనకు ఇష్టం. కేవలం రూ. 250 ఖర్చుతో వరి పొలంలో కలుపు తీతకు ఉపయోగపడే చేతి పరికరాన్ని రూపొందించి 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్-2019'లో ప్రథమ బహుమతి పొందారు. ఈ నేపథ్యంలో వరిపొలంలో కలుపుతీత పరికరంతో పాటు తాను రూపొందించిన మరో మూడు పరికరాలను అశోక్ ఈ ఏడాది 'ఈ-న్నోవేట్' పోటీకి పంపారు. ఏకంగా నాలుగు బంగారు పతకాలు గెల్చుకున్నారు.

**విత్తనం వేసుకునే చేతి పరికరం:**

పత్తి, కంది, పెసర వంటి పంటల విత్తనాలను నడుము వంచే పని లేకుండా నిలబడే వేసుకునే ఒక చిన్న పరికరాన్ని అశోక్ రూపొందించారు. 3 అడుగుల ఎత్తున ఉండే ఈ పరికరంతోవేగంగా, సులువుగా, పురుషులు / మహిళలు / పెద్దలు / పిన్నలు ఎవరైనా సమాన దూరంలో విత్తనాలు వేసుకోవచ్చు.

**4 రకాలుగా ఉపయోగపడే పరికరం**

అశోక్ తయారు చేసిన మరో పరికరం చిన్న రైతులకు నాలుగు రకాలుగా ఉపయోగపడుతుంది. పత్తి, మిరప పొలాల్లో సాళ్ల మధ్య దున్నుతూ కలుపు తొలగించడానికి, విత్తనాలు వేసుకునే సమయంలో అచ్చు తీయడానికి, ఆరబోసిన ధాన్యాలను కుప్ప చేయడానికి, కళ్లాల్లో గడ్డిని పోగు చేయడానికి చిన్న మార్పులతో ఈ పరికరాన్ని ఉపయోగించుకోవచ్చు.


**బహుళ ప్రయోజనకర యంత్రం**

అశోక్ మొట్టమొదటిసారిగా పెట్రోలుతో నడిచే పెద్ద వ్యవసాయ యంత్రాన్ని రూపొందించారు. ఏ పంటలోనైనా ఎకరంలో 15 నిమిషాల్లో పిచికారీని పూర్తి చేయడం, ఎరువు వంటి బరువులను ఇంటి నుంచి పొలానికి రవాణా చేయడానికి కూడా ఇదిఉపయోగపడుతుంది. అందుకే మల్టీపర్పస్ యుటిలిటీ వెహికల్ అని దీనికి పేరుపెట్టారు. 'ఈ-న్నోవేట్' పోటీలో దీనికి కూడా బంగారు పతకం వచ్చింది. ప్రభుత్వం లేదా దాతలు ఆర్థిక సాయం చేస్తే పేటెంట్ పొంది, ఆ తర్వాత ఈ యంత్రాన్ని రైతులకు అందిస్తానని కొండంత ఆశతో చెబుతున్న అశోక్‌కు ఆల్ దబెస్ట్ చెబుదామా!

– సాక్షి సౌజన్యంతో

■

నీటి సంరక్షణకు అనేక మార్గాలు , కాని ఏ మార్గమైనా దానిని అనుసరించవలసింది మనమే



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘకాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-10-2021; Posting Date: 05 & 06-10-2021

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

# ఎఫ్ పి ఓ లు , ఎఫ్ పి సి ల వార్షిక మహాసభల సంరంభం !




ఆజీవ ఎఫ్ పి సి



ధరణి ఎఫ్ పి ఓ




ధీశాలి ఎఫ్ పి సి



గుంతకల్లు ఎఫ్ పి సి




పెద్ద వడుగూరు ఎఫ్ పి ఓ



రామసముద్రం ఎఫ్ పి ఓ




వి కోట ఎఫ్ పి ఓ



మిడ్తూరు ఎఫ్ పి ఓ




జై జిసాన్ ఎఫ్ పి ఓ



నందికొట్కూరు ఎఫ్ పి ఓ

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089